నేటి కందం- నేటికి అందం

విఘ్నేశుని బూజింపగ
విఘ్నమ్ములు తొలగిపోయి విధులన్నియు-ని
ర్విఘ్నమ్ముగ జరుగగలవు
విఘ్నేశుడు మన కొసంగు వేల శుభంబుల్

(7-9-24 వినాయక చవితి)



-రాధశ్రీ
సెల్:9494481210

# నేటినిజం
తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

చురక

ప్రకృతి సమతుల్యత
పాటించని అభివృద్ధి
ప్రళయానికి హేతువై
ప్రగతి చుట్టు తిరుగుద్ది
దురాశ మితిమీరితే
దుఃఖమే ఎప్పుడైన
ప్రభుత్వాలు మేల్కొనెనా
పట్టపట్టి ఇప్పుడైనా



-వేల్పుల నారాయణ
9440433475

హైదరాబాద్ | శనివారం 7-9-2024 | NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 | సంపుటి :31 సంచిక:31 | పేజీలు:6 | వెల: రూ.1/-


# ఏపీ, తెలంగాణకు కేంద్రం భారీగా వరద సాయం .. నిధుల విడుదల

-ఏపీ విపత్తు నిర్వహణ సంస్థ ప్రధాన కార్యాలయంలో భేటీ
-అధికారులతో సమావేశం.. పరిస్థితుల సమీక్ష
-బుడమేరుకు గండ్లు పడిన ప్రాంతాల పరిశీలన
-పరిస్థితులు, నష్టాలపై స్పష్టమైన అంచనాలు
-చర్యలు తీసుకుంటామని తెలిపిన కేంద్ర బృందం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 6 :భారీ వర్షాలు, వరదలకు గురైన రెండు తెలుగు రాష్ట్రాలకు కేంద్రం భారీ సహాయాన్ని ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు కలిపి రూ. 3,300 కోట్లను ప్రకటించింది. తక్షణ సహాయ చర్యల కోసం నిధులు విడుదల చేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది .



వరదల వల్ల నష్టపోయిన బాధితులను ఆదుకునేందుకు వీటిని విడుదల చేసింది. ముఖ్యంగా ఏపీలోని విజయవాడ, పరిసర ప్రాంతాల్లో జరిగిన విపత్తుపై కేంద్రం చలించింది. అదేవిధంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో జరిగిన నష్టంపై ఆరా తీసిన కేంద్రం నిధులు విడుదల చేసిందికంద్ర హోం శాఖ అదనపు కార్యదర్శి సంజీవ్ కుమార్ జిందాల్ నేతృత్వంలోని ప్రత్యేక బృందం ఏపీలో పర్యటించింది. భారీ వర్షాలు, వరదలతో అతలాకుతలమైన కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లో సంభవించిన పరిస్థితులను, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సహాయక చర్యలను పరిశీలించింది. తొలుత కేంద్ర బృందం ఏపీ విపత్తు నిర్వహణ సంస్థ ప్రధాన కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించింది.

ఈ సందర్భంగా రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదలతో సంభవించిన పరిస్థితులను, రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న సహాయ పునరావాస చర్యలను రాష్ట్ర జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి సాయిప్రసాద్, జలవనరుల శాఖ ఇంజనీర్-ఇన్-చీఫ్ (ఈఎన్‌సీ) వెంకటేశ్వరరావు వారికి వివరించారు. అనంతరం.. స్టేట్ ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్‌ను, ప్రకాశం బ్యారేజీ వద్ద దెబ్బతిన్న గేట్లను కేంద్ర బృందం పరిశీలించింది. తర్వాత ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం కొండపల్లి శాంతినగర్ ? కవులూరు వద్ద బుడమేరుకు పడిన గండ్లను, గండ్లను పూడ్చే పనులను కేంద్ర బృందం పరిశీలించింది.

## రామవరప్పాడు రింగ్‌రోడ్డు.. ముంపు ప్రాంతాల పరిశీలన..

భారీ వర్షాలు, వరదల ధాటికి నీట మునిగిన రామవరప్పాడు రింగ్ రోడ్డుతో పాటు కండ్రిక, పైపుల రోడ్డు, విశాలాంధ్ర కాలనీ, రాధా నగర్, పాత రాజీవ్ నగర్, కట్టరోడ్, సుందరయ్య నగర్, వడ్డెర కాలనీ, అంబాపురం 16వ లైన్, అజిత్ సింగ్ నగర్, ప్రకాష్ నగర్, ఎల్.బి.ఎస్. నగర్, న్యూ అజిత్ సింగ్ నగర్, పాయకపురం చేపల మార్కెట్ తదితర ప్రాంతాల్లో ట్రాక్టం పై కేంద్ర బృందం ప్రయాణించింది.

## నీట మునిగిన కాలనీల పరిశీలన..

వరదలతో నీట మునిగిన కాలనీలు, ప్రస్తుత పరిస్థితులు, ప్రభుత్వం చేపట్టిన సహాయక చర్యలను కేంద్ర బృందం స్వయంగా పరిశీలించింది. వరద ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలను స్వయంగా పర్యవేక్షించిన రాష్ట్ర రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖ స్పెషల్ సీఎస్ ఆర్.పి. సిసోడియా కేంద్ర బృందం వెంట ట్రాక్టర్ పై ప్రయాణించి వారికి ముంపు ప్రాంతాల్లో ప్రస్తుత పరిస్థితులు, ప్రభుత్వ సహాయక చర్యలను స్వయంగా వివరించారు.

# తెలంగాణ ఉద్యమకారుడు జిట్టా బాలకృష్ణారెడ్డి కన్నుమూత

-ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతాపం



హైదరాబాద్ సెప్టెంబర్ 6 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : తెలంగాణ ఉద్యమకారుడు జిట్టా బాలకృష్ణారెడ్డి శుక్రవారం ఉదయం కన్నుమూశారు. దీంతో ఆయన మృతిపట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సంతాపం తెలిపారు. జిట్టా మరణంపై రేవంత్ తన ట్విట్టర్‌లో భావోద్వేగానికి గురయ్యారు. మిత్రుడు, సన్నిహితుడు జిట్టా బాలకృష్ణా రెడ్డి అకాల మరణం దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. యువతను ఐక్యం చేసి చేసి తెలంగాణ ఉద్యమంలో కీలక ప్రాత పోషించారని గుర్తు చేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడి ప్రార్థిస్తూ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ రేవంత్ ట్వీట్ చేశారు. ఆయన గత కొన్ని రోజుల నుంచి బ్రెయిన్ క్యాన్సర్ తో బాధ పడుతున్నారు. యశోదాస్పత్రిలో చికిత్స తీసుకుంటూ జిట్టా తుదిశ్వాస విడిచారు.

# తెలంగాణ పీసీసీ చీఫ్‌గా మహేశ్ కుమార్ గౌడ్



హైదరాబాద్, సెప్టెంబర్ 6 : తెలంగాణ పీసీసీ చీఫ్‌గా మహేశ్ కుమార్ నియామకం అయ్యారు. ఈ మేరకు కాంగ్రెస్ అధిష్టానం అధికారికంగా ప్రకటించింది. ఇప్పటి వరకు సీఎం రేవంత్ రెడ్డి పీసీసీ అధ్యక్షుడిగా కొనసాగిన సంగతి తెలిసిందే. తెలంగాణకు కొత్త పీసీసీ అధ్యక్షుడిని నియమించేందుకు కాంగ్రెస్ పార్టీకి 9 నెలల సమయం పట్టింది.2023లో పీసీసీ ఎన్నికల కమిటీ సభ్యుడిగా పని చేశారు. ప్రస్తుతం ఎమ్మెల్సీగా కొనసాగుతున్నారు మహేశ్ కుమార్ గౌడ్. ప్రస్తుతం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కూడా కొనసాగుతున్నారు. ఇక పీసీసీ అధ్యక్ష పదవికి మధుయాష్కీ గౌడ్, జీవన్ రెడ్డి, జగ్గా రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, అద్దంకి దయాకర్ పోటీ పడ్డారు. కానీ చివరకు రేవంత్‌కు అత్యంత సన్నిహితుడైన మహేశ్ కుమార్ గౌడ్‌ను పీసీసీ పీఠం వరించింది. పీసీసీ అధ్యక్షుడు ఎవరనే కసరత్తు రెండు వారాల క్రితమే పూర్తయినప్పటికీ.. కాంగ్రెస్ అధిష్టానం అధికారికంగా నేడు ప్రకటించింది.

## మహేశ్ కుమార్ గౌడ్ రాజకీయ నేపథ్యం..

బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ 1966 ఫిబ్రవరి 24న నిజామాబాద్ జిల్లాలోని భీంగల్ మండలం, రహత్‌నగర్‌లో జన్మించారు. గిరిరాజ్ కాలేజీలో డిగ్రీ పూర్తి చేశారు. మహేష్ కుమార్ గౌడ్ గిరిరాజ్ కాలేజీలో డిగ్రీ చదువుతున్న సమయంలో విద్యార్థి దశలో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, 1986లో నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడిగా, జాతీయ యువజన కాంగ్రెస్ కార్యదర్శిగా పని చేశాడు.

ఆ తరువాత 1994లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో డిచ్‌పల్లి నియోజకవర్గం నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా చిన్న వయస్సులోనే పోటీ చేసి ఓటమి పాలయ్యారు. మహేష్ కుమార్ 2013 నుండి 2014 వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్‌గా పని చేశాడు.

మహేష్ కుమార్ 2014లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గం నుండి కాంగ్రెస్ అభ్య ర్థిగా పోటీ చేసి ఓటమి చవిచూశారు. ఆ తరువాత పీసీసీ కార్యదర్శిగా, అధికార ప్రతినిధిగా, పీసీసీ ప్రధాన కార్యదర్శిగా పని చేసి 2018లో నిజామాబాద్ అర్బన్ టికెట్ ఆశించిన ఆ ఎన్నికల్లో ఆ స్థానాన్ని అధిష్టానం మైనార్టీలకు కేటాయించడంతో ఆయన పోటీ నుంచి తప్పుకున్నారు. మహేష్ కుమార్ 2018 సెప్టెంబర్ 18న రాష్ట్ర ఎన్నికల కమిటీలో కాంగ్రెస్ మేనిఫెస్టో కమిటీ కన్వీనర్‌గా నియమితులయ్యారు.

2021 జూన్ 26న పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా, 2022 డిసెంబర్ 10న కాంగ్రెస్ రాజకీయ వ్యవహారాల కార్యనిర్వాహక కమిటీలో ప్రత్యేక ఆహ్వానితుడిగా, 2023 జూన్ 20న తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీ-పీసీసీ) ఎన్నికల కమిటీలో సభ్యుడిగా నియమితులయ్యారు. మహేష్ కుమార్ గౌడ్ 2023లో నిజామాబాద్ అర్బన్ నుంచి పోటీ చేయాలనీ భావించిన ఆ నియోజకవ ర్గం నుండి మాజీ మంత్రి షబ్బీర్ అలీని పార్టీ అభ్యర్థిగా నిలపడంతో ఆయన పోటీ నుంచి తప్పుకోగా, కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక 2024 జనవరి 29న తెలంగాణ శాసనమండలిలో ఎమ్మెల్యే కోటాలో రెండు స్థానాలకు జరిగే ఎన్నికల్లో ఆయన పేరును కాంగ్రెస్ అధిష్టానం ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించింది. ఎమ్మెల్సీ పదవికి ఇతర పార్టీల నుండి ఎవరూ నామినేషన్లు దాఖలు చేయకపోవడంతో మహేష్ కుమార్ గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. ఈ ఏడాది జనవరి 31న తెలంగాణ శాసనమండలి సభ్యుడిగా ప్రమాణస్వీకారం చేశారు మహేశ్ కుమార్ గౌడ్.

# అధికారులు సమన్వయంతో పని చేయాలి- మంత్రి సీతక్క

-సామరస్య పూర్వక వాతావరణాన్ని కొనసాగించే చర్యలు చేపట్టండి
-శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు
-అసాంఘీక శక్తులకు మంత్రి సీతక్క వార్నింగ్
-వినాయక చవితి ఏర్పాట్లపై ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఉన్నతాధికారులతో మంత్రి సీతక్క టెలి కాన్ఫరెన్స్

ఆదిలాబాద్, సెప్టెంబర్ 6 :ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధికారులు సమన్వయంతో, అప్రమత్తంగా వ్యవహరించి శాంతియుత వాతావరణంలో భక్తి శ్రద్ధలతో వినాయక చవితి వేడుకలు విజయవంతమయ్యేలా చూడాలని ఆదిలాబాద్ జిల్లా ఇన్చార్జి మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క సూచించారు. ఆయా జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, జిల్లా అధికారులు, డీపీఓలు, మున్సిపల్ కమిషనర్లతో శుక్రవారం సచివాలయంలో మంత్రి సీతక్క టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలో వినాయక చవితి ఏర్పాట్లను సమీక్షించారు.

ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. గణేష్ ఉత్సవ కమిటీలు, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, పౌర సంఘాలు, స్వచ్ఛంద సంస్థలతో సమావేశాలు నిర్వహిస్తూ ఎక్కడా ఇలాంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

జిల్లాలో శాంతికి విఘాతం కలిగించే చర్యలను తమ ప్రభుత్వం సహించదని, ఎంతటి వారినైనా కఠినంగా శిక్షిస్తామని మంత్రి సీతక్క హెచ్చరించారు. శాంతి భద్రతల విషయంలో ఎక్కడా రాజీపడబోమని స్పష్టం చేశారు. అన్ని మతాల విశ్వాసాలను గౌరవిస్తమన్న మంత్రి, అందరి హక్కులను ప్రభుత్వం కాపాడుతుందని చెప్పారు. ప్రశాంత వాతావరణం లేకపోతే జిల్లా అభివృద్ధి కుంటుపడుతుందని మంత్రి అభిప్రాయపడ్డారు. అందుకే ఇక్కడ ఏదైనా సమస్యలు తలెత్తితే దాని మూలాల్లోకి వెళ్లి తుంచేస్తామని స్పష్టం చేశారు. ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తే చట్టపరంగా కఠిన శిక్షలు విధిస్తామని హెచ్చరించారు. ఆదిలాబాద్ వంటి మారుమూల ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు డాక్టర్లకు వంద శాతం జీతాలను తమ ప్రభుత్వం పెంచినట్లు మంత్రి గుర్తు చేశారు. ఇంకా జిల్లా అభివృద్ధి కోసం మరెన్నో కార్యక్రమాలు చేపడుతున్నట్లు వెల్లడించారు.

వినాయక చవితి నేపథ్యంలో జిల్లాలో శాంతియుత వాతావరణాన్ని కొనసాగించేందుకు పలు కీలక సూచనలు చేశారు మంత్రి సీతక్క. విగ్రహాల ప్రతిష్ట నుంచి నిమజ్జనం వరకు ప్రణాళిక రూపొందించుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. డయల్ 100కి వచ్చే కాల్స్‌పై తక్షణమే స్పందించాలనీ.. వెంటనే ఘటనా



స్థలానికి చేరుకుని సమస్య పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలన్నారు. తప్పుడు ప్రచారం చేసే సోషల్ మీడియా మీద నిఘా పెంచాలని చెప్పారు. జైనూరు తరహాలోనే జిల్లా వ్యాప్తంగా అన్నివర్గాల మత పెద్దలతో సమావేశాలు ఏర్పాటు చేసి పరస్పరం విశ్వాసం నెల కొల్పేలా చర్యలు చేపట్టాలని మంత్రి సీతక్క ఆదేశాలు జారీ చేశారు.

టెలి కాన్ఫరెన్స్ సందర్భంగా తమ పరిధిలో చేపట్టిన ఏర్పాట్లను, నెలకొని వున్న శాంతిభద్రతల పరిస్థితులను ఆయా జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు మంత్రికి వివరించారు. మంత్రి సూచనలకు అనుగుణంగా అన్ని శాఖలతో సమన్వయంతో పనిచేసి వినాయక చవితి వేడుకలను శాంతియుత వాతావరణంలో విజయవంతం చేస్తామని తెలిపారు.

# నేటి యువతను విక్షిత్ భారత్ కోసం సిద్ధం చేసే బాధ్యత ఉపాధ్యాయుల చేతుల్లో ఉంది: ప్రధాని

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 6 :ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈరోజు తెల్లవారుజామున 7, లోక్ కళ్యాణ్ మార్గ్‌లోని తన నివాసంలో జాతీయ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్న ఉపాధ్యాయులతో సంభాషించారు.

అవార్డు గ్రహీతలు తమ బోధనా అనుభవాన్ని ప్రధానితో పంచుకున్నారు. వారు నేర్చుకోవడం మరింత ఆసక్తికరంగా చేయడానికి వారు ఉపయోగించే ఆసక్తికరమైన పద్ధతుల గురించి కూడా మాట్లాడారు. వారు తమ రెగ్యులర్ టీచింగ్ వర్క్‌తో పాటు వారు చేస్తున్న సామాజిక కార్యక్రమాల ఉదాహరణలను కూడా పంచుకున్నారు. వారితో సంభాషించిన ప్రధాన మంత్రి, బోధనా నైపుణ్యం పట్ల వారి అంకితభావాన్ని మరియు అవార్డుల ద్వారా గుర్తించబడిన సంవత్సరాలుగా వారు ప్రదర్శించిన విశేషమైన ఉత్సాహాన్ని ప్రశంసించారు.

జాతీయ విద్యా విధానం ప్రభావం గురించి ప్రధాన మంత్రి చర్చించారు మరియు ఒకరి మాతృభాషలో విద్యను అభ్యసించడం యొక్క ప్రాముఖ్యత గురించి మాట్లాడారు. ఉపాధ్యాయులు వివిధ భాషలలో విద్యార్థులకు స్థానిక జానపద సాహిత్యాన్ని బోధించవచ్చని, తద్వారా విద్యార్థులు బహుళ భాషలు నేర్చుకోవచ్చని మరియు భారతదేశం యొక్క శక్తివంతమైన సంస్కృతిని కూడా తెలుసుకోవచ్చు.

భారతదేశ వైవిధ్యాన్ని అన్వేషించడానికి ఉపాధ్యాయులు తమ విద్యార్థులను విద్యా పర్యటనలకు తీసుకెళ్లవచ్చని, ఇది వారి అభ్యాసానికి తోడ్పడుతుందని మరియు వారు తమ దేశం గురించి సమగ్రంగా తెలుసుకోవడంలో సహాయపడుతుందని ప్రధాన మంత్రి అన్నారు. దీని వల్ల పర్యాటకం వృద్ధి చెందుతుందని, స్థానిక ఆర్థిక వ్యవస్థకు కూడా ఊరట లభిస్తుందని ఆయన అన్నారు.

అవార్డు గ్రహీత ఉపాధ్యాయులు సామాజిక మాధ్యమాల ద్వారా ఒకరితో ఒకరు కనెక్ట్ అవ్వాలని మరియు వారి ఉత్తమ అభ్యాసాలను పంచుకోవాలని, తద్వారా ప్రతి ఒక్కరూ అలాంటి అభ్యాసాలను నేర్చుకుంటారు, స్వీకరించగలరు మరియు ప్రయోజనం పొందగలరు అని ప్రధాన మంత్రి సూచించారు.

ఉపాధ్యాయులు దేశానికి చాలా ముఖ్యమైన సేవను అందిస్తున్నారని మరియు నేటి యువతను విక్షిత్ భారత్ కోసం సిద్ధం చేసే బాధ్యత వారి చేతుల్లో ఉందని ప్రధాన మంత్రి అన్నారు.

జాతీయ ఉపాధ్యాయుల అవార్డుల ఉద్దేశ్యం ఏమిటంటే, దేశంలోని అత్యుత్తమ ఉపాధ్యాయులు తమ నిబద్ధత మరియు కృషి ద్వారా విద్యా రంగం నాణ్యతను మెరుగుపరచడమే కాకుండా వారి విద్యార్థుల జీవితాలను సుసంపన్నం చేసిన వారి విశిష్ట సహకారాన్ని జరుపుకోవడం మరియు గౌరవించడం. ఈ సంవత్సరం అవార్డుల కోసం, దేశవ్యాప్తంగా 82 మంది ఉపాధ్యాయులను ఎంపిక చేశారు, ఇందులో పాఠశాల విద్య ఉ అక్షరాస్యత విభాగం ఎంపిక చేసిన 50 మంది ఉపాధ్యాయులు, ఉన్నత విద్యా శాఖ ద్వారా 16 మంది ఉపాధ్యాయులు మరియు నైపుణ్యాభివృద్ధి మరియు వ్యవస్థాపకత మంత్రిత్వ శాఖ ద్వారా 16 మంది ఉపాధ్యాయులు ఉన్నారు.

# హైదరాబాద్ జూబ్లీహిల్స్ లో భూమిలో నుంచి పొగలు

హైదరాబాద్ సెప్టెంబర్ 6 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: భాగ్యనగరంలోని జూబ్లీహిల్స్ ప్రాంతంలో కెబిఆర్ పార్కు వద్ద భూమిలో నుంచి పొగలు వచ్చాయి. భూమిలో నుంచి పొగలు ఎలా వస్తున్నాయని స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఈ వింత ఘటన చూసేందుకు వాహనదారులు గుమిగూడడంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. పొగలు ఎక్కడ నుంచి వచ్చాయి అనే దానిపై స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అండర్ గ్రౌండ్‌లో విద్యుత్ శాఖ సిబ్బంది 11కెవి కేబుల్‌ను అమర్చినట్టు స్థానికులు చెబుతున్నారు. కేబుల్ డ్యామేజీ కావడంతో పొగలు వచ్చి ఉంటాయని తెలుస్తోంది. అండర్ గ్రౌండ్‌లో కరెంట్ వైర్లలో షార్ట్ సర్క్యూట్ అయ్యే అవకాశం ఉన్నట్టు సమాచారం. గత కొన్ని రోజుల నుంచి హైదరాబాద్ నగరంలో భారీ వర్షాలు కురుస్తున్న విషయం తెలిసిందే.

# వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి-సాయి చౌదరి

హైదరాబాద్ సెప్టెంబర్ 6 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : వర్షాలు తగ్గినప్పటికీ రానున్న మరికొన్ని రోజులు సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, పాతబడిన ఇండ్లు పడిపోయే ఆస్కారము ఉందని, అందువల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వికారాబాద్ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ చెప్పారు. ఈ సందర్భంగా సాయి చౌదరి మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాల భయం లేనప్పటికీ రానున్న మరో నాలుగు, ఐదు రోజుల వరకు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని, సీజనల్ వ్యాధులు అయినటువంటి జ్వరాలు, డెంగ్యూ, చికెన్ గున్యా వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని అన్నారు. ఎవరికి వారు తమ ఇంటి ముందు ఉన్న మురికి కాలువను శుభ్రం చేసుకోవడం వంటి చర్యలు తీసుకోవడం, పిచ్చి మొక్కలు తొలగించటం, త్రాగునీటి ట్యాంకుల శుభ్రం చేసుకోవడం, క్లోరినేషన్ వంటి కార్యక్రమాలపై దృష్టి కేంద్రీకరించి విస్తృతంగా నిర్వహించాలని సాయి చౌదరి కోరారు

# ఎంఎంటీఎస్ రైలు ఢీకొని వృద్ధుడు మృతి

హైదరాబాద్, సెప్టెంబర్ 6 : పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని వృద్ధుడు మృతి చెందాడు. కాచిగూడ రైల్వే హెడ్‌కానిస్టేబుల్ సమ్మయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గుర్తుతెలియని వృద్ధుడు (60)శుక్రవారం యాకత్‌పుర-డబీర్‌పుర రైల్వేస్టేషన్‌ల మధ్య పట్టాలు దాటుతుండగా ఎంఎంటీఎస్ రైలు ఢీకొనడంతో ఆ వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు. సంమాచారం అందుకున్న రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృత దేహన్ని ఉస్మానియా దవాఖానకు తరలించారు. మృతి చెందిన వృద్ధుడి వివరాల కోసం 9948695948లో సంప్రదించాలని కోరారు. కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తన్నట్లు సమ్మయ్య తెలిపారు.

# సినీ గేయ రచయిత "వడ్డేపల్లి కృష్ణ" ఇక లేరు..!



రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 6:(నేటినిజం ప్రతినిధి): సినీ గేయ రచయిత వడ్డేపల్లి కృష్ణ ఇక లేరు. శుక్రవారం తెల్లవారుజామున హైదరాబాదులోని ప్రైవేట్ ఆసుపత్రిలో తుది శ్వాస విడిచారు.రాజన్న సిరిసిల్ల జిల్లా సిరిసిల్ల పట్టణంలో చేనేత కుటుంబం నుంచి ఎదిగొచ్చిన వడ్డేపల్లి కృష్ణ రాజన్న సిరిసిల్ల జిల్లా నుంచి సాహిత్య సృజనతో జాతీయస్థాయిలో గుర్తింపు పొందారు.

లలితగీత రచయితగా, వడ్డేపల్లి కృష్ణ ప్రామాణిక పరిశోధకుడిగా, టెలివిజన్ ధారావాహికల దర్శకుడిగా, గీత రచయితగా, వివిధ డాక్యుమెంటరీల రూపకర్తగా, అనేక పుస్తకాలతో పాటు, ఆడియో ఆల్బమ్‌ల రూపకర్తగా, సంగీత, నృత్య రూపకాల రచయితగా, వివిధ నాటక రచయితగా, విభిన్న కోణాల్లో తన రచనా నైపుణ్యం తో సాహిత్య సేవలు అందించారు. మానేరు గడ్డమీద నుంచి ఎదిగొచ్చిన వడ్డేపల్లి కృష్ణ తెలుగు సినీ సాహిత్యంలో ప్రత్యేక ముద్ర వేశారు. వడ్డేపల్లి కృష్ణ మృతి పట్ల పలువురు సాహిత్యాభిమానులు సంతాపం తెలిపారు.

# హైదరాబాద్‌లో పలు చోట్ల భారీ వర్షం..

హైదరాబాద్, సెప్టెంబర్ 6 : రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరాన్ని మరోసారి వర్షం ముంచెత్తింది. నగరంలోని పలు చోట్ల శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఈ భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. రోడ్లపై వరద నీరు నిలిచిపోవడంతో.. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

పలు చోట్ల భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఉదయం నుంచి నగర వ్యాప్తంగా ఎండ దంచికొట్టిన సంగతి తెలిసిందే. ఉన్నట్టుండి సాయంత్రం 4 గంటల నుంచి ఆకాశం మేఘావృతమైంది. 5 గంటల సమయంలో భారీ వర్షం కురిసింది.

పంజాగుట్ట, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, మాదాపూర్, గచ్చిబౌలి, కొండాపూర్, మెహిదీపట్నం, లక్డీకాపూల్, బేగంపేట్, హుస్సేన్ సాగర్, సికింద్రాబాద్, తార్నాక, ఎల్బీనగర్, హబ్సిగూడతో పాటు పలు ప్రాంతాల్లో వాన దంచికొట్టింది. భారీ వర్షం పడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

# హైదరాబాద్ చేరుకున్న దీప్తి జివాంజీ.. ఎయిర్‌పోర్ట్‌లో ఘన స్వాగతం




హైదరాబాద్, సెప్టెంబర్ 6 :ప్రతిష్ఠాత్మక పారిస్ పారాలింపిక్స్‌లో భారత యువ అథ్లెట్ జివాంజీ దీప్తి సత్తాచాటిన విషయం తెలిసిందే. మహిళల 400మీటర్ల టీ20 రేసులో కాంస్య పతకం గెలుచుకుంది. ఆద్యంతం ఆసక్తికరంగా సాగిన రేసులో అద్భుత ప్రదర్శన కనబరిచిన ఈ తెలంగాణ అమ్మాయి అరంగేట్రం పారాలింపిక్స్‌లో తొలి పతకాన్ని ముద్దాడి ఔరా అనిపించింది. తాజాగా దీప్తి స్వదేశానికి చేరుకుంది. ఇవాళ ఉదయం హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో ల్యాండ్ అయ్యింది. ఈ సందర్భంగా దీప్తికి ఘన స్వాగతం లభించింది. అధికారులు, కుటుంబ సభ్యులు, స్నేహితులు ఆమెకు గ్రాండ్ వెల్‌కమ్ చెప్పారు.




మానేరు రచయితల సంఘం
రాజన్న సిరిసిల్ల జిల్లా రచయితల సంక్షేమ సంఘం (రిజిష్టర్డ్)
గూడూరి సీతారాం ఫౌండేషన్

గూడూరి సీతారాం కథా పురస్కారం - 2023
ఆచార్య సూర్యా ధనంజయ్ - 'ఝోళి' గోర్ బంజారా సాకి
శ్రీ పిన్నంశెట్టి కిషన్ - 'మా లేంబాళవాటిక కథలు'

కథా సంపుటాలకు ప్రదానోత్సవం
14 సెప్టెంబర్, 2024 శనివారం, సాయంత్రం 4 గంటలకు
డా. సినారె విజ్ఞాన మందిరం, జిల్లా గ్రంథాలయం. సిరిసిల్ల

సభాధ్యక్షులు
శ్రీ టి.వి. నారాయణ
అధ్యక్షులు, మానేరు రచయితల సంఘం

ముఖ్య అతిథులు
డా. నలిమెల భాస్కర్
సాహిత్య అకాడమి అవార్డు గ్రహీత, పూర్వ అధ్యక్షులు 'మారసం'
శ్రీ జూకంటి జగన్నాథం
మహాకవి డా. దాశరథి అవార్డు గ్రహీత

పురస్కార ప్రదాత
శ్రీ గూడూరి వేణు
శ్రీ గూడూరి సీతారాం కుమారులు

ఆత్మీయ అతిథి
శ్రీ గూడూరి ప్రవీణ్
మాజీ చైర్మన్, తెలంగాణ టెక్స్‌టైల్స్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్

స్వాగతం-పురస్కార పరిచయం
డా. పత్తిపాక మోహన్
సాహిత్య అకాడమి అవార్డు గ్రహీత (బాల సాహిత్యం), వ్యవస్థాపకులు 'మారసం'

ఎలగొండ రవి
కార్య నిర్వాహక అధ్యక్షులు, మారసం

ఆడెపు లక్ష్మణ్
ప్రధాన కార్యదర్శి, మారసం

మరియు కార్యవర్గం, మానేరు రచయితల సంఘం - గూడూరి సీతారాం ఫౌండేషన్

# విద్యకు తొలి మెట్టు అక్షరాస్యత మాత్రమే !

**(08 సెప్టెంబర్ 'అంతర్జాతీయ అక్షరాస్యత దినం' సందర్భంగా)**

విద్యావంతులు నాయకత్వం వహించే సమాజం సుస్థిర సమగ్రాభివృద్ధి దిశలో పయనిస్తుంది. విద్యతోనే అన్ని సమస్యలకు సమాధానాలు దొరుకుతాయి. పేదరిక నిర్మూలనలో విద్య పాత్ర వెలకట్టలేనిది. ప్రపంచ దేశాల తొలి ప్రయత్నం అక్షరాస్యత రేటును పెంచడం అవుతుంది. అక్షరాస్యులకు ఉన్నత విద్య గొడుగును కల్పిస్తే కుటుంబాల జీవనశైలిలో సమూల మార్పులు చోటు చేసుకుంటాయి. విద్యకు తొలి మెట్టు అక్షరాస్యత మాత్రమే. నిరక్షరాస్య సమాజం నిశీధిలో మగ్గినట్లే. అక్షరాస్యతను విస్తరిస్తే విద్యాకుసుమాల సుగంధం సమాజంలో వ్యాపిస్తుంది. దేశ సమగ్రాభివృద్ధి అక్షరాస్యత రేటుతో ప్రత్యక్ష సంబంధాన్ని కలిగి ఉంటుంది.

అక్షరాస్యత రేటు:

2018 గణాంకాల ప్రకారం ప్రపంచ వయోజనుల అక్షరాస్యత రేటు 86 శాతం (పురుషుల్లో 90 శాతం, స్త్రీల్లో 83 శాతం) ఉండగా, భారతదేశ అక్షరాస్యత రేటు 77.7 శాతంగా (పురుషుల్లో 86 శాతం, స్త్రీల్లో 67 శాతం) నమోదు అయ్యింది. ప్రపంచ దేశాల్లో 15-24 ఏండ్ల యువతలో అక్షరాస్యత రేటు 92 శాతంగా ఉంది. ఉన్నత విద్యలో చేరుతున్న భారత యువతకు సంబంధించిన గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో (జిఈఆర్) 27.1 శాతంగా ఉండగా, ప్రపంచ దేశాల్లో అత్యధికంగా టెర్షరీ స్థాయి విద్య ఆస్ట్రేలియాలో 67 శాతంగా నమోదు అయ్యింది. ప్రపంచంలోని 145 పేద అల్పాదాయ, మధ్య ఆదాయవర్గ దేశాల విద్యారంగాలకు అభివృద్ధి చెందిన దేశాలు చేయూతను ఇవ్వాలి. విశ్వ విద్యకు, ఆరోగ్య కల్పనకు పెద్ద పీట వేయాలి. సామాజిక ఆర్థిక ప్రగతి, పేదరిక నిర్మూలన, అసమానతల తొలగింపు, అధిక జనాభా, శాంతి సామరస్యాల జీవనం లాంటివి విద్యతోనే పరిష్కరించబడతాయి.

నిర్బంధ పాఠశాల విద్య నేటికీ అందని ద్రాక్షేనా:

"ఐరాస సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు-2030" జాబితాలో 4వ లక్ష్యంగా 'నాణ్యమైన విద్య (క్వాలిటీ ఎడ్యుకేషన్)'కు పెద్ద పీట వేశారు. ఐరాస ఎజెండా-2030కి సంబంధించిన 2021 నివేదిక ప్రకారం కోవిడ్-19 కల్లోలం విద్యారంగాన్ని అత్యంత ప్రభావితం చేసిందని తేలింది. విద్యకు విఘాతం కలిగితే అన్ని రంగాలపై దాని దుష్ప్రభావం పడుతుంది. పేదలు, అల్ప ఆదాయ వర్గాల పిల్లల విద్యార్జన కుంటుపడింది. ప్రపంచవ్యాప్తంగా గత పది ఏండ్లలో (2010-19) సెకండరీ విద్య పూర్తి చేసిన యువత 46 శాతం నుంచి 53 శాతానికి పెరిగారు. 2010లో ప్రాథమిక విద్య 70 శాతం ఉండగా, 2018లో 84 శాతానికి పెరిగింది. 2030 నాటికి 89 శాతానికి చేరవచ్చని ఐరాస అంచనా వేస్తున్నాది. కరోనా విపత్తుతో 2030 నాటికి 200 మిలియన్ల ప్రపంచ బాలలు పాఠశాల విద్యకు కూడా దూరంగా ఉంటారని అంచనా. నేటికీ 65 శాతం పాఠశాలల్లో మాత్రమే కనీస వసతులు కల్పించబడి ఉన్నాయి.

అక్షరాస్యత పునాది - ఉన్నత విద్య ప్రగతి:

నిరంతర విద్య కల్పనతో పాటు నైపుణ్య శిక్షణలను పెంపొందించే కృషి జరగాలి. విద్యరంగంలో లింగ వివక్ష మరింత దుష్ప్రభావాన్ని చూపుతున్నది. బాలికలకు విద్యను అందిస్తే అనంతర కాలంలో కుటుంబమే విద్యావంతుల కోవెల అవుతుంది. మహిళా సాధికారతకు మహిళా విద్య ప్రధాన ఆయుధం కావాలి. పాఠశాలలు లేకపోవడం, వసతుల లేమి, బాలికలకు టాయిలెట్స్ కొరత, విద్యుత్తు కనెక్షన్ లేకపోవడం, ఆధునిక ఐసిటి వనరుల లేమి, నిరక్షరాస్యులైన తల్లితండ్రులు, పేదరికం, అధిక జనాభా లాంటి ప్రతికూలతలు విద్యావ్యాప్తిని నిరోధిస్తున్నాయి. ఆర్థికాభివృద్ధికి దోహదపడే అంశాలుగా పేదరిక నిర్మూలన, ఉచిత విద్య కల్పన, వైద్య ఆరోగ్య వసతులు, సామాజిక రక్షణ, ఉద్యోగ ఉపాధుల కల్పన, వాతావరణ ప్రతికూల మార్పులను తగ్గించడం లాంటి చర్యలు తీసుకోవడం మరువరాదు. అందరికి నిర్బంధ పాఠశాల విద్య ఉచితం చేయాలి. వృత్తి నైపుణ్యాలు అందించే విద్య ప్రణాళికలు వేసి కార్యరూపం ఇవ్వాలి. ఉన్నత విద్యలో జీఈఆర్‌ను క్రమంగా పెంచేలా చర్యలు తీసుకోవాలి. విశ్వం కుగ్రామమైన ఈ డిజిటల్ యుగంలో దేశాల మధ్య అసమానతలు ప్రపంచ మానవాళికి ప్రతిబంధకాలు కానున్నాయి.

విద్యతోనే విశ్వ కళ్యాణం కలుగుతుందని, మానవాళి సంక్షేమానికి విద్య ఉత్తమ ఉపకరణమని తెలుసుకొని అందరు పిల్లల్ని, యువతను విద్యావంతులుగా మార్చే మహాయజ్ఞంలో మనందరం భాగస్వామ్యం తీసుకుందాం.

- డా: బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత.. కలెక్టర్



శ్రీకాకుళం, సెప్టెంబర్ 6 : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు.

శుక్రవారం జిల్లా కలెక్టర్ తన పర్యటనలో భాగంగా ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న ఫ్రైడే డ్రైడే కార్యక్రమ అమలును శ్రీకాకుళం కెళ్ళ వీధిలో ఆకస్మికంగా పర్యటించి పరిశీలించారు. కళ్ల వీధిలో నివాసం ఉన్న వారికి ప్రతిరోజూ మునిసిపల్ సిబ్బంది విధులకు హాజరు అవుతున్నారా అని ఆరా తీయగా.. వస్తున్నారని తెలుపగా, నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, అక్కడ ప్రజలకు డ్రైడే ఫ్రైడే పాటించాలని తెలియజేశారు. కీటక జనిత వ్యాధుల నుండి జాగ్రత్తగా ఉండాలని, దోమల లార్వా పెరగకుండా, నీటి కుంటలు లేకుండా చూసుకోవాలని, మలేరియా, డెంగ్యూ వంటి వ్యాదుల నుండి జాగ్రత్తగా ఉండాలని పలు సూచనలు చేశారు.

ఈ ఆకస్మిక తనిఖీ కార్యక్రమంలో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ సుధీర్, బి.గణేష్ కుమార్, సచివాలయ, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీశైలం భ్రమరాంబిక మల్లికార్జున స్వామి వార్లకు బంగారు పూలు విరాళం..



అమరావతి, సెప్టెంబర్ 6 :శ్రీశైల, భ్రమరాంబిక మల్లికార్జున స్వామి అమ్మవార్ల దేవస్థానంకు ఓ భక్తుడు బంగారు పూలను శుక్రవారం బహుమతిగా అందజేశారు. కర్నూల్ కు చెందిన బీసీ శివకుమార్ దేవస్థానంనకు 108 బంగారు పూలను విరాళంగా సమర్పించారు. ఈ బంగారు పూల మొత్తం బరువు 19 గ్రాములు.

అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో దాతలు వీటిని సీనియర్ వేదపండితులు గంటి రాధాకృష్ణ, పర్యవేక్షకులు కె. అయ్యన్న, అమ్మవారి ఆలయం ఇన్స్పెక్టరు కె.మల్లికార్జున, సంబంధిత గుమాస్తా ఎం.సావిత్రిలకు అందజేశారు. అనంతరం వీరికి తగు రశీదు, వేదాశీర్వచనంతో శ్రీస్వామి అమ్మవార్ల శేషవస్త్రాలను, ప్రసాదాలు, ఆలయ అధికారులు అందజేశారు.

# ఈఏఎంను సందర్శించిన ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 6 :సెమీకండక్టర్, ఎలక్ట్రానిక్స్ రంగంలో ప్రముఖ సంస్థ ఏఈఎంను సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్ తో కలసి ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ సందర్శించారు. అంతర్జాతీయ సెమీకండక్టర్ రంగంలో ఏఈఎం పాత్ర, దాని కార్యకలాపాలతో పాటు భారత్ లో వ్యాపార ప్రణాళికల గురించి సంస్థ ప్రతినిధులు వివరించారు. సింగపూర్ సెమీకండక్టర్ పరిశ్రమల సమాఖ్య ఆ దేశంలో సెమీకండక్టర్ పరిశ్రమల అభివృద్ధి, భారత్ లో ఉన్న అవకాశాలు, సహకారం గురించి క్లుప్తంగా వివరించింది. ఈ రంగానికి చెందిన ఇతర సింగపూర్ సంస్థల ప్రతినిధులు సైతం ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. సెప్టెంబర్ 11 నుంచి 13 వరకు గ్రేటర్ నోయిడాలో జరగనున్న సెమికాన్ ఇండియా ఎగ్జిబిషన్‌లో పాల్గొనాల్సిందిగా సింగపూర్ సెమీకండక్టర్ సంస్థలను ప్రధాన మంత్రి ఆహ్వానించారు.

భారత్ లో సెమీకండక్టర్ తయారీకి అనుకూల వాతావరణాన్ని అభివృద్ధి చేయడానికి, ఈ రంగంలో సింగపూర్ సామర్థ్యాన్ని పరిగణించి ద్వైపాక్షిక సహకారాన్ని విస్తరించాలని రెండు దేశాలు నిర్ణయించాయి. రెండు దేశాల మధ్య సంబంధాలను బలోపేతం చేసేందుకు తయారీ రంగంపై ముఖ్యంగా సెమీకండక్టర్లపై దృష్టి సారించాలని భారత్-సింగపూర్ మంత్రుల రెండో రౌండ్ టేబుల్ సమావేశంలో నిర్ణయించారు. అలాగే సెమీకండక్టర్ తయారీ భాగస్వామ్యంపై ఇరు పక్షాలు అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి.

ఏఈఎంలో శిక్షణ పొందుతున్న ఒడిశా వరల్డ్ స్కిల్ సెంటర్ కు చెందిన విద్యార్థులు , సీఐఐ ఎంటర్‌ప్రైజ్ ఇండియా రెడీ టాలెంట్ ప్రోగ్రామ్ ద్వారా భారత్ ను సందర్శించిన సింగపూర్ విద్యార్థులు, ఆ సంస్థలో పనిచేస్తున్న భారతీయ ఇంజనీర్లతో ఇద్దరు ప్రధానులు సంభాషించారు.

# సింగపూర్ అగ్రశ్రేణి వాణిజ్యవేత్తలతో ప్రధానమంత్రి సమావేశం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 6 :ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఇవాళ సింగపూర్ అగ్రశ్రేణి వాణిజ్యవేత్తల బృందంతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పెట్టుబడి ఫండ్లు, మౌలిక సదుపాయాలు, తయారీ, ఇంధనం, ఆర్థిక-ఆర్థికేతర సుస్థిరత, రవాణా సంబంధిత రంగాల్లోని సంస్థల ముఖ్య కార్యనిర్వహణాధికారు (సిఇఒ)లతో పలు అంశాలపై ఆయన చర్చించారు. సింగపూర్ ఉప ప్రధాని గౌరవనీయ గాన్ కిమ్ యోంగ్, హోం-న్యాయ వ్యవహారాల మంత్రి శ్రీ కె.షణ్ముగం కూడా ఇందులో పాల్గొన్నారు.

భారత్‌లో ఇప్పటికే వివిధ రంగాల్లో వారు పెట్టుబడులు పెట్టడాన్ని గుర్తుచేస్తూ ప్రధాని ప్రశంసించారు. రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాల బలోపేతం సహా ఆర్థిక సహకార విస్తరణలో సింగపూర్ అగ్రశ్రేణి పారిశ్రామికవేత్తలు పోషించిన పాత్రను ప్రధాని కొనియాడారు. భారత్‌తో వారి వాణిజ్య భాగస్వామ్యానికి మరింత సౌలభ్యం దిశగా సింగపూర్‌లో 'ఇన్వెస్ట్ ఇండియా' కార్యాలయం ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. భారత్-సింగపూర్ స్నేహబంధం సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యంగా రూపుదిద్దుకోవడం ద్వారా ద్వైపాక్షిక ఆర్థిక సంబంధాలకు పెద్ద పీట వేసినట్లు కాగలదని ఆయన అన్నారు.

# స్వచ్ఛభారత్ మిషన్ ప్రభావాన్ని వెల్లడిస్తున్న నివేదికను ప్రజలతో పంచుకున్న ప్రధాని

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 6 :దేశంలో శిశు, బాలల మరణాలను తగ్గించడంలో స్వచ్ఛభారత్ మిషన్ వంటి కార్యక్రమాల ప్రభావాన్ని ప్రముఖంగా పేర్కొన్న ఓ శాస్త్రీయ నివేదికను ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ ప్రజలతో పంచుకున్నారు.

"స్వచ్ఛ భారత్ మిషన్ వంటి కార్యక్రమాల ప్రభావాన్ని స్పష్టం చేస్తున్న పరిశోధనలు సంతోషం కలిగిస్తున్నాయి. శిశు, బాలల మరణాలను తగ్గించడంలో సరైన టాయిలెట్ల సదుపాయం కీలక పాత్ర పోషిస్తుంది. శుభ్రమైన, సురక్షితమైన పారిశుద్ధ్యం ప్రజారోగ్య పరివర్తనలో కీలకంగా మారింది. ఈ విషయంలో భారత్ ముందంజలో ఉండడం సంతోషాన్నిస్తోంది" అని సామాజిక మాధ్యమం ఎక్స్ లో ప్రధాని పోస్ట్ చేశారు

# తిరుపతిలో అగ్నికి ఆహుతైన హోటల్




తిరుపతి, ఆగస్టు 6: తిరుపతి కేశవాయన గుంటలోని టీటీడీ ఎస్ జి ఎస్ కళాశాల సమీపంలో హోటల్ లో ప్రమాదవశాత్తు మంటలు చేలరేగి అగ్నికి ఆహుతి అయింది. శుక్రవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా పైకప్పు కు మంటలు అంటుకుని పూర్తిగా దగ్ధమైంది. క్షణాల్లోనే మంటలు వ్యాపించడంతో హోటల్లో ఉన్న వంట సామాగ్రి, ఆహార పదార్థాలు, సరుకులు, ప్లాస్టిక్ కుర్చీలు, బల్లలు,ఫ్యాన్లు, వంటకు వినియోగించడానికి సిద్ధం చేసి ఉన్నసామాగ్రి పూర్తిగా దగ్ధమయ్యాయి.

మంటలు పెద్ద ఎత్తున వ్యాపించడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకునే మంటలను అదుపు చేశారు. అయితే అప్పటికే పూర్తిగా మంటల్లో హోటల్ కాలిపోయింది. సుమారు మూడు లక్షల రూపాయలు నష్టం వాటిల్లినట్లు అగ్నిమాపక సిబ్బంది అంచనా వేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# రబీ ఉల్లి నిల్వలు 4.7 లక్షల టన్నులు : శ్రీ జోషి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 6 :"35 రూపాయలకే కిలో ఉల్లిపాయలు" కార్యక్రమాన్ని కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజాపంపిణీ, నూతన పునరుత్పాదక ఇందన శాఖ మంత్రి శ్రీ ప్రహ్లాద్ జోషి ఈ రోజు ప్రారంభించారు. జాతీయ వినియోగదారుల సహకార సమాఖ్య(ఎన్సీసీఎఫ్), జాతీయ వ్యవసాయ సహకార మార్కెటింగ్ సమాఖ్య(నాఫెడ్)కు చెందిన విక్రయ వాహనాలకు జెండా ఊపి అమ్మకాలు ప్రారంభించారు. వినియోగదారులకు కూరగాయలను సరసమైన ధరలకు అందుబాటులో ఉంచేందుకు ప్రభుత్వ గోదాంలో నిల్వ ఉన్న ఉల్లిపాయల్ని బహిరంగ మార్కెట్లో విక్రయిస్తున్నారు.

మీడియాను ఉద్దేశించి మాట్లాడుతూ ఆహార ద్రవ్యోల్బణాన్ని నియంత్రణలో ఉంచడమే ప్రభుత్వ ప్రాధాన్యమని, వివిధ రూపాల్లో ప్రత్యక్షంగా చేపట్టిన ధరల స్థిరీకరణ చర్యలు ఇటీవలి మాసాల్లో ద్రవ్యోల్బణం రేటును తగ్గించడంలో ముఖ్యపాత్ర పోషించాయని తెలిపారు.

"రబీ దిగుబడిలో సేకరించిన 4.7 లక్షల టన్నుల ఉల్లి నిల్వలు అందుబాటులో ఉన్నాయి. మార్కెట్లో నిత్యావసరాల ధరలు పెరిగినప్పుడు వాటిని నియంత్రించడానికి ధరల స్థిరీకరణ నిధిని ప్రధానమంత్రి శ్రీ నరేంద్రమోదీ సూచనల మేరకు ప్రారంభించాం" అని శ్రీ జోషి తెలిపారు. ఉల్లిని రిటైల్ గా విక్రయించడం ద్వారా దేశవ్యాప్తంగా వినియోగదారులకు ఊరట లభిస్తుందని అన్నారు.

ఆహార ద్రవ్యోల్బణాన్ని నియంత్రించడానికి, ధరలను స్థిరంగా ఉంచడానికి కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలలో ఉల్లి నిల్వల అమ్మకం అంతర్భాగంగా ఉంది.

ప్రధాన వినియోగ కేంద్రాల్లో ఎన్సీసీఎఫ్, నాఫెడ్ మొబైల్ వ్యాన్లు, ఈకామర్స్ వేదికలు, కేంద్రీయభండార్, సఫల్ అవుట్ లెట్ల ద్వారా ఉల్లి రిటైల్ అమ్మకాలు జరుగుతాయి. ఉల్లి ధరల సరళిని అనుసరించి సరఫరా, విక్రయాలు పెంచడం లేదా తగ్గించడం చేస్తారు. దేశవ్యాప్తంగా 550 కేంద్రాల ద్వారా ఉల్లితో సహా 38 రకాల వస్తువుల ధరలను వినియోగదారుల వ్యవహారాల విభాగం, కేంద్ర ప్రభుత్వం పర్యవేక్షిస్తున్నాయి. రోజువారీ ధరలు, సరళి ఆధారంగా నిల్వల నుంచి ఏ ప్రాంతాలకు ఎంత ఉల్లి సరఫరా చేయాలో నిర్ణయిస్తారు.

గతేడాది మూడు లక్షల టన్నుల ఉల్లి సేకరించగా ఈ ఏడాది రబీ పంట నుంచి ఎన్సీసీఎఫ్, నాఫెడ్ ద్వారా 4.7 లక్షల టన్నుల ఉల్లి సేకరించారు. రబీలో ఉల్లిసాగు ఎక్కువగా ఉండే మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ లోని రైతులు, రైతు సంఘాల నుంచి ఈ ఉల్లిని సేకరించారు. చెల్లింపులను రైతుల ఖాతాలకు నేరుగా బదిలీ చేశారు. అన్ని దశల్లోనూ సాంకేతికతను వినియోగించి సమీకృత వ్యవస్థ ద్వారా ఉల్లి సేకరణ, నిల్వ, సరఫరాను పర్యవేక్షించారు.

గతేడాది పోలిస్తే ఈ రబీ సీజన్లో ధరలు మెరుగ్గా ఉన్నాయని రైతులు భావిస్తున్నారు. గతేడాది మండీ ధరలు క్వింటాలుకు రూ.693?రూ.1205 ఉంటే.. ఈ ఏడాది రూ.1230 -రూ2578 మధ్య ఉన్నాయి. అలాగే గతేడాది క్వింటాలుకు రూ.1724 ధర లభిస్తే ఈ ఏడాది రూ.2,833 గా ఉంది. గతంతో పోలిస్తే నాణ్యమైన ఉల్లి సేకరణ ధరలు ప్రస్తుతం అధికంగా ఉన్నాయి.

గత ఏడాదితో పోలిస్తే ఖరీఫ్ లో ఉల్లి సాగు విస్తీర్ణంలో ఈ ఏడాది ఆగస్టు 26 నాటికి 102 శాతం పెరుగుదల కనిపించింది. దీంతో ఉల్లి నిల్వలు లభ్యత పెరగనుంది. ఫలితంగా ధరలు అందుబాటులో ఉంటాయని అంచనా వేస్తున్నారు. వ్యవసాయ విభాగం అందించిన సమాచారం ప్రకారం ఆగస్టు 26 నాటికి 2.90 లక్షల హెక్టార్లలో ఖరీఫ్ సాగు ప్రారంభమైంది. గతేడాది ఇదే సమయంలో సాగు విస్తీర్ణం 1.94 లక్షల హెక్టార్లుగా ఉంది. వీటితో పాటుగా 38 లక్షల టన్నుల ఉల్లి రైతులు, వ్యాపారుల వద్ద నిల్వ ఉన్నట్టు సమాచారం.

వినియోగదారుల వ్యవహారాల శాఖ ఉల్లి పంట లభ్యత, ధరలపై నిఘా ఉంచి వినియోగదారులు, రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అవసరమైన చర్యలు తీసుకుంటోంది. వినియోగదారులకు సరసమైన ధరలకు ఉల్లిని అందించడంతో పాటు రైతులకు లాభదాయకంగా ఉండేలా ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటుంది.

దేశ రాజధాని ఢిల్లీ, ముంబయిల్లో ఈ రోజు నుంచి ఉల్లి రిటైల్ విక్రయాలు ప్రారంభమవుతాయి. మరో వారం రోజుల్లో కోల్‌కతా, గువాహటి, హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, అహ్మదాబాద్, రాయ్‌పూర్, భువనేశ్వర్ నగరాల్లో ఏజెన్సీలు విక్రయాలు ప్రారంభిస్తాయి. సెప్టెంబర్ మూడోవారానికి దేశవ్యాప్తంగా పంపిణీ ప్రారంభమవుతుంది. వీటి నిమిత్తం సహకార సంస్థలు, రిటైల్ వ్యాపార సంస్థలతో ఏజెన్సీలు ఒప్పందాలు కుదుర్చుకుంటున్నాయి.

# సింగపూర్ ప్రధానితో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సమావేశం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 6 :సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్ తో ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు (గురువారం) సమావేశమయ్యారు. లారెన్స్ వాంగ్ పార్లమెంటు భవనం వద్ద ప్రధాన మంత్రికి సంప్రదాయ రీతిలో స్వాగతం పలికారు.

భారత్ -సింగపూర్ ద్వైపాక్షిక సంబంధాలలో చోటుచేసుకొన్న పురోగతిని నేతలు ఇద్దరూ వారు జరిపిన చర్చలలో భాగంగా సమీక్షించారు. ద్వైపాక్షిక చర్చలలో మరింత విస్తృతికి అవకాశాలు అపారంగా ఉన్నాయని, ఈ సంబంధాన్ని ఒక సంపూర్ణ వ్యూహాత్మక భాగస్వామ్యం స్థాయికి తీసుకెళ్లాలని వారు నిర్ణయించారు. ఇది భారత్ అనుసరిస్తున్న 'యాక్ట్ ఈస్ట్ పాలసీ'కి సైతం పెను ప్రోత్సాహాన్ని ఇవ్వనుంది. ఆర్థిక సంబంధాలలో బలమైన పురోగతిని నేతలు లెక్కలోకి తీసుకొని, రెండు దేశాల మధ్య వ్యాపారాన్ని, పెట్టుబడులను మరింతగా పెంచుకొందామంటూ పిలుపునిచ్చారు. భారత్ లో దాదాపు 160 బిలియన్ డాలర్ల మేరకు సింగపూర్ పెట్టుబడి పెట్టి భారత్ కు ఒక ప్రముఖ ఆర్థిక భాగస్వామ్య దేశంగా ఉన్న విషయాన్ని ప్రధాన మంత్రి ప్రముఖంగా ప్రస్తావించారు. భారతదేశంలో వేగంగా చోటుచేసుకొంటున్న నిలకడతో కూడిన వృద్ధి సింగపూర్ వ్యాపార సంస్థలకు పెట్టుబడులు పెట్టడానికి గొప్ప అవకాశాలను ప్రసాదించిందని కూడా ఆయన అన్నారు. రక్షణ, భద్రత, సముద్ర సంబంధిత సహకారం, విద్య, కృత్రిమ మేధ (ఎఐ), ఫిన్‌టెక్, సరికొత్తగా ఉనికిలోకి వస్తున్న సాంకేతిక విజ్ఞాన ప్రధాన రంగాలు, విజ్ఞాన శాస్త్రం, సాంకేతిక విజ్ఞానం వంటి రంగాలలో ఇప్పటికే కొనసాగుతున్న సహకారాన్ని కూడా వారు సమీక్షించారు. ఉభయ దేశాల ఆర్థిక బంధాలను, రెండు దేశాల ప్రజల మధ్య గల పరస్పర సంబంధాలను ఇప్పటి కన్నా మరింత పెంపొందింపచేసుకోవడానికి ఈ రెండు దేశాల మధ్య సంధానాన్ని పటిష్ట పరచవలసిన అవసరం ఉందని ఇద్దరు నేతలు పేర్కొన్నారు. గ్రీన్ కారిడార్ ప్రాజెక్టులను వేగవంతం చేయాలని కూడా వారు అభిప్రాయపడ్డారు.

సింగపూర్ లో కిందటి నెలలో నిర్వహించిన భారత్ - సింగపూర్ మంత్రిత్వ శాఖల రౌండ్ టేబుల్ సమావేశంలో చేసిన తీర్మానాల పైన కూడా ఇద్దరు నేతలు చర్చించారు. మంత్రిత్వశాఖల సంబంధిత రౌండ్ టేబుల్ సమావేశం అనేది ఒక విశిష్ట యంత్రాంగమని నేతలు అభిప్రాయపడుతూ, ద్వైపాక్షిక సహకారానికి ఒక కొత్త కార్యక్రమాల పట్టికను సిద్ధం చేయడంలోను, దానిని గురించి చర్చోపచర్చలు చేయడంలోను రెండు పక్షాల సీనియర్ మంత్రులు తీసుకొన్న చొరవను ప్రశంసించారు. మంత్రిత్వ శాఖల సంబంధిత రౌండ్ టేబుల్ సమావేశాల్లో గుర్తించిన అడ్వాన్స్‌డ్ మాన్యుఫాక్చరింగ్, సంధానం, డిజిటలీకరణ, ఆరోగ్య సంరక్షణ - మందులు, నైపుణ్యాభివృద్ధి, ఇంకా స్థిరత్వం మొదలైన సహకార ప్రధాన రంగాలలో మరింత త్వరిత కార్యాచరణకు నేతలు పిలుపునిచ్చారు. ఈ రంగాలలో ప్రత్యేకించి, సెమికండక్టర్స్ రంగంలో, కీలకమైన, సరికొత్తగా ఉనికిలోకి వస్తున్న సాంకేతికతల రంగంలోను సహకారం, ద్వైపాక్షిక సంబంధాలలో ఒక కొత్త అధ్యాయానికి దారి తీసి, తద్వారా మన సంబంధాలను భవిష్యత్తు అవసరాలకు తగినట్లుగా తీర్చిదిద్దుతాయని నేతలు స్పష్టం చేశారు.

ద్వైపాక్షిక సంబంధాలకు 60 ఏళ్ళు అవుతున్న సందర్భంగా సంబంధిత వార్షికోత్సవాన్ని 2025లో నిర్వహించాలనే అంశం కూడా నేతల చర్చలో ప్రస్తావనకు వచ్చింది. రెండు దేశాల మధ్య పెనవేసుకున్న సాంస్కృతిక బంధం ఈ సంబంధాలలో ఒక ముఖ్య భాగంగా ఉందని ప్రధాని ప్రముఖంగా ప్రస్తావిస్తూ, భారతదేశం తొలి తిరువళ్ళువార్ సాంస్కృతిక కేంద్రాన్ని సింగపూర్ లో ఏర్పాటు చేయనుందని ప్రకటించారు. భారత్- ఆసియాన్ సంబంధాలు, ఇండో-పసిఫిక్ ప్రాంతానికి సంబంధించి భారత్ దార్శనికతలు సహా పరస్పర ప్రయోజనాలు ముడిపడ్డ ప్రాంతీయ అంశాల పైన, ప్రపంచ అంశాల పైన సైతం నేతలు వారి ఆలోచనలను ఒకరికి మరొకరు తెలియజెప్పుకొన్నారు.

సెమికండక్టర్లు, డిజిటల్ సాంకేతికతలు, నైపుణ్యాభివృద్ధి, ఇంకా ఆరోగ్య సంరక్షణ రంగాలలో సహకారానికి ఉద్దేశించిన అవగాహనపూర్వక ఒప్పందం (ఎంఒయు) సంబంధిత పత్రాలను నేతలు ఇద్దరి సమక్షంలో ఉభయ పక్షాల ప్రతినిధులు ఒకరికి మరొకరు ఇచ్చి పుచ్చుకొన్నారు. ఇవి ఇంతవరకు భారత్- సింగపూర్ మంత్రిత్వ శాఖల సంబంధిత రౌండ్ టేబుల్ సమావేశాలు జరిగినప్పునడు చోటుచేసుకొన్న చర్చల తాలూకు ఫలితాలు కావడం గమనించదగ్గది. సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్ ను భారతదేశాన్ని సందర్శించవలసిందంటూ ప్రధాన మంత్రి ఆహ్వానించారు. ఈ ఆహ్వానానికి లారెన్స్ వాంగ్ అంగీకారాన్ని తెలిపారు.

# జల సంరక్షణను జాతీయ ప్రాధాన్య కార్యక్రమంగా మలచాలన్న ప్రధాన మంత్రి సంకల్పాన్ని నెరవేర్చడం దీని ధ్యేయం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 6 :గుజరాత్ లోని సూరత్ లో జరపతలపెట్టిన 'జల్ సంచయ్ జన్ భాగీదారీ కార్యక్రమం' ప్రారంభోత్సవంలో ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ శుక్రవారం మధ్యాహ్నం 12.30 కి వీడియో కాన్ఫరెన్సింగ్ మాధ్యమం ద్వారా ప్రసంగిస్తారు.

జల భద్రత విషయంలో ప్రధాని దార్శనికతను విస్తరించడంలో భాగంగా ఈ కార్యక్రమం ఒక భాగం. సాముదాయిక భాగస్వామ్యానికి, యాజమాన్యానికి పెద్ద పీటను వేస్తూ నీటిని పొదుపుగా వాడుకోవాలని ఈ కార్యక్రమం ద్వారా ప్రచారం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి యావత్తు సమాజం, సంపూర్ణ ప్రభుత్వం కలిసికట్టుగా కృషి చేయాలన్న దృక్పథం చోదక శక్తిగా ఉండబోతోంది. గుజరాత్ ప్రభుత్వం నాయకత్వంలో 'జల్ సంచయ్' కార్యక్రమం సఫలం కావడంతో, జలశక్తి మంత్రిత్వ శాఖ రాష్ట్ర ప్రభుత్వ సమన్వయంతో "జల్ సంచయ్ జన్ భాగీదారీ" కార్యక్రమాన్ని గుజరాత్ లో మొదలుపెడుతోంది. రాబోయే కాలంలో నీటికి కొదువ ఉండని స్థితికి చేరుకొనేటట్లు చూడడానికి పౌరులను, స్థానిక సంస్థలను, పరిశ్రమలను, ఇతర సంబంధిత వర్గాల వారిని కూడగట్టడానికి గుజరాత్ ప్రభుత్వం పాటుపడింది.

సాహిత్యం సంగీతం
శ్రీ మానస ఆర్ట్ థియేటర్స్
ఆహ్వానం
ప్రముఖ రచయిత
శ్రీ బండారుపల్లి రామచంద్రరావు గారు
రచించిన
ఆత్మీయ రూప, ఆనంద ప్రద
శ్రీ శ్రీనివాస శరణు మంజరి
మరియు
ఆప్తరూప, అభయ వరద
ఏడుకొండల శ్రీ వేంకటేశ్వర శరణుమంజరి
గ్రంథాల ఆవిష్కరణోత్సవం
తేది : 08-09-2024 ఆదివారం ఉ॥ 10-30 గం॥లకు
వేదిక : డా॥ కె.వి.రమణాచారి గారి క్యాంప్ కార్యాలయం, హఫీజ్ మంజిల్, మహావీర్ హస్పటల్ ఎదురుగా, మాసబ్‌ట్యాంక్, హైదరాబాద్.
ముఖ్య అతిథి, ఆవిష్కర్త : డా॥ కె.వి.రమణాచారి గారు, ఐ.ఎ.ఎస్. (రి.) తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు
సభాధ్యక్షులు : డా॥ పి. లలితవాణి గారు, ప్రముఖ విద్యావేత్త
విశిష్ట అతిథి : శ్రీ బైస దేవదాస్ గారు, "నేటి నిజం", పత్రిక సంపాదకులు
గౌరవ అతిథి : శ్రీ గుదిబండి వెంకటరెడ్డి గారు, అధ్యక్షులు, జి.వి.ఆర్. ఆరాధన కల్చరల్ ఫౌండేషన్, హైదరాబాదు
రఘుశ్రీ
వ్యవస్థాపక కార్యదర్శి, శ్రీ మానస ఆర్ట్స్ థియేటర్స్, హైదరాబాదు
చరవాణి : 9247108893

# ఉపాధ్యాయులకు జాతీయ అవార్డులను ప్రదానం చేసిన రాష్ట్రపతి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 6 :ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఈరోజు (సెప్టెంబర్ 5) న్యూఢిల్లీలో నిర్వహించిన ఒక కార్యక్రమంలో రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఉపాధ్యాయులకు జాతీయ అవార్డులను ప్రదానం చేశారు.

ఈ సందర్భంగా రాష్ట్రపతి ప్రసంగిస్తూ, ఉపాధ్యాయులు- సున్నితమైన వారు, నిజాయితీ గల వారు, విద్యావంతులైన వారిని కూడా సంసిద్ధం చేయాల్సి ఉంటుందన్నారు. జీవితంలో పురోగతి సాధించడం విజయం అవుతుందని, అయితే ఇతరుల బాగు కోసం పనిచేయడంలోనే జీవితానికి అర్థం ఉందని పేర్కొన్నారు. మనలో కరుణ ఉండాలి. మన ప్రవర్తనలో నైతిక విలువలు ఉండాలి. అర్థవంతమైన జీవితంలోనే విజయవంతమైన జీవితం ఉంటుంది. ఈ విలువలను విద్యార్థులకు బోధించడం ఉపాధ్యాయుల కర్తవ్యం అన్నారు.

ఏదైనా విద్యావ్యవస్థ విజయంలో ఉపాధ్యాయులదే అత్యంత కీలక పాత్ర అని రాష్ట్రపతి పేర్కొన్నారు. బోధన అనేది కేవలం ఉద్యోగం మాత్రమే కాదు. ఇది మానవాభివృద్ధి సాధన కోసం ఒక పవిత్ర బాధ్యత అన్నారు. ఒక పిల్లవాడు మెరుగ్గా రాణించనిపక్షంలో, అందుకు విద్యా వ్యవస్థ, ఉపాధ్యాయులే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. పరీక్షల్లో ప్రతిభ కనబరిచే విద్యార్థులపైనే ఉపాధ్యాయులు ప్రత్యేకంగా దృష్టి సారిస్తారని ఆమె పేర్కొన్నారు. అయితే చదువులో అద్భుతంగా రాణించడమన్నది ప్రతిభలో ఒక కోణం మాత్రమేనన్నారు. ఒక పిల్లవాడు చాలా మంచి క్రీడాకారుడు కావచ్చు. కొంతమంది పిల్లలకు నాయకత్వ నైపుణ్యాలు ఉండవచ్చు. మరొక పిల్లవాడు సామాజిక సంక్షేమ కార్యక్రమాలలో ఉత్సాహంగా పాల్గొనవచ్చు. ఉపాధ్యాయుడు ప్రతి పిల్లవాడిలో సహజంగా ఉన్న ప్రతిభను గుర్తించి దానిని వెలికితీయాల్సి ఉంటుందన్నారు.

ఒక సమాజపు అభివృద్ధికి ఆ సమాజంలోని మహిళల స్థితి ప్రమాణంగా ఉంటుందని రాష్ట్రపతి తెలిపారు. మహిళల గౌరవానికి ఎలాంటి భంగం కలగని రీతిలో పిల్లలను తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకూ, తల్లిదండ్రులకూ ఆమె సూచించారు. మహిళల పట్ల గౌరవం కేవలం మాటలకే పరిమితం కాకుండా ఆచరణలో కూడా ఉండాలని ఆమె ఆకాంక్షించారు.

గురుదేవ్ రవీంద్రనాథ్ ఠాగూర్ చెప్పిన ప్రకారం, ఒక ఉపాధ్యాయుడు నిరంతరం జ్ఞానాన్ని పొందకపోతే అతను/ఆమె నిజమైన అర్థంలో బోధన చేసినట్లు కాదని రాష్ట్రపతి పేర్కొన్నారు. ఉపాధ్యాయులంతా నిరంతరం జ్ఞానాన్ని పొందే ప్రక్రియను కొనసాగిస్తారని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు. ఇలా చేయడం ద్వారా వారి బోధన మరింత అర్థవంతంగానూ, ఆసక్తికంగానూ ఉంటుందని ఆమె తెలిపారు.

ఉపాధ్యాయులూ, వారి తరంలోని విద్యార్థుల అభివృద్ధి చెందిన భారతదేశాన్ని సృష్టిస్తారని రాష్ట్రపతి తెలిపారు. ఉపాధ్యాయులు అలాగే విద్యార్థులు సైతం ప్రాపంచిక ఆలోచనా విధానాన్ని, ప్రపంచ స్థాయి నైపుణ్యాలను కలిగి ఉండాలని ఆమె సూచించారు. అభివృద్ధికాముక ఆలోచనా విధానం గల ఉపాధ్యాయులు మాత్రమే అభివృద్ధి చెందిన దేశాన్ని నిర్మించగలరన్నారు. విద్యార్థులకు స్ఫూర్తిగా నిలవడం ద్వారా మన ఉపాధ్యాయులు మన దేశాన్ని ప్రపంచ విజ్ఞాన కేంద్రంగా తీర్చిదిద్దగలరని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు.

# జిట్టా మరణం బీఆర్ఎస్‌కు తీరని లోటు

## – బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంతాపం

హైదరాబాద్ సెప్టెంబర్ 6 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: జిట్టా బాలకృష్ణారెడ్డి మృతి పట్ల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంతాపం తెలిపారు. ఆయన మరణ వార్తగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఎంతో క్రియాశీలకంగా వ్యవహరించి, కేసీఆర్ వెంటనడిచిన వ్యక్తుల్లో జిట్టా ఒకరని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సొంత ఆస్తులను కూడా లెక్క చేయకుండా ఉద్యమ నిర్మాణానికి తన వంతు కృషి చేశారని చెప్పారు. జిట్టా లాంటి నాయకుడిని కోల్పోవడం బీఆర్ఎస్‌కు తీరని లోటన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేరాలన్నారు. కుటుంబ సభ్యులు, బంధువులు, శ్రేయోభిలాషులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బ్రెయిన్ ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతున్న జిట్టా బాలకృష్ణారెడ్డి.. గత కొంతకాలంగా సికింద్రాబాద్ యశోద దవాఖానలో చికిత్స పొందుతున్నారు. పరిస్థితి విషమించడంతో శుక్రవారం ఉదయం ఆయన తుదిశ్వాస విడిచారు. దీంతో ఆయన భౌతికకాయాన్ని కుటుంబ సభ్యులు భువనగిరికి తరలించారు. సాయంత్రం 4 గంటలకు పట్టణ శివార్లలోని మగ్గంపల్లి రోడ్డులో ఉన్న తమ ఫామ్‌హౌస్‌లో అంత్యక్రియలు నిర్వహిస్తామని వెల్లడించారు.

# సురేందర్ రెడ్డి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి- ఎమ్మెల్యే మల్లారెడ్డి



హైదరాబాద్, సెప్టెంబర్ 6 :రైతు సురేందర్ రెడ్డి కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని, రైతు కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి డిమాండ్ చేశారు. రుణ మాఫీ కాలేదని ఆవేదన చెంది మేడ్చల్ జిల్లా వ్యవసాయ కార్యాలయంలో శుక్రవారం ఉదయం ఆత్మహత్య చేసుకున్న రైతు సురేందర్ రెడ్డి మృతదేహానికి సికింద్రాబాద్ గాంధీ హాస్పిటల్‌లో మాజీ మంత్రులు హరీశ్ రావు, సబితా ఇంద్రా రెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో కలిసి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ.. రుణమాఫీ కాలేదన్న కారణంతో రైతు సురేందర్ రెడ్డి ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమన్నారు. పంట పండించే రైతన్న ప్రాణం కోల్పోయి గాంధీ హాస్పిటల్ మార్చురీలో ఉండటం మనస్సును కలిచివేసిందన్నారు. రైతన్నలారా.. రుణమాఫీ కాలేదనే కారణంతో దయచేసి ఆత్మహత్యలు చేసుకోకండి. ధైర్యాన్ని కోల్పోకండి. బీఆర్ఎస్ పార్టీ మీకు అండగా ఉంటుందని భరోసానిచ్చారు. అలాగే మేనిఫెస్టోలో చెప్పినట్లు కాంగ్రెస్ ప్రభుత్వం రైతులందరికి రుణమాఫీ చెయ్యాలన్నారు.

# వరద ప్రాంతాలకు నిత్యావసర సరుకులు- వాహనాల్లో ఇంటింటికీ పంపిణీ



అమరావతి, సెప్టెంబర్ 6 : విజయవాడలోని వరద బాధితులకు నిత్యావసర సరకుల పంపిణీ చేసే వాహనాలను శుక్రవారం ఉదయం మంత్రులు నాదెండ్ల మనోహర్, అచ్చెంనాయుడు, కందుల దుర్గేష్, ఎంపీ కేశినేని చిన్ని ప్రారంభించారు. ఆపై బాధితులకు వాటిని అందజేశారు. ఈ సందర్భంగా నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ.. వరద బాధితులను ఆదుకునేందుకు అన్ని రకాల చర్యలు తీసుకున్నామన్నారు. 1200 వాహనాల్లో ప్రతీ ఇంటికి సరుకులు అందేలా ప్లాన్ చేశామని చెప్పారు. రేపు పండుగ అయినా పంపిణీ కార్యక్రమం ఉంటుందని స్పష్టం చేశారు. నాలుగు రోజుల్లో అందరికీ సరుకులు అందేలా చేస్తామన్నారు. నీళ్లు ఉన్న ప్రాంతాల్లో తోపుడు బళ్ల ద్వారా సరుకులు లోపలకు తీసుకెళతామని మంత్రి నాదెండ్ల చెప్పారు.

అనంతరం ఎంపీ కేశినేని చిన్ని మాట్లాడుతూ.. ఇంతటి విపత్తులో బాధితులను ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుందన్నారు. చంద్రబాబు ఈ వయంసులోనూ ప్రజల కోసం ఎంతో శ్రమిస్తున్నారని, బాధితులకు అన్ని విధాలా సహాయక చర్యలు అందేలా ఆదేశాలు ఇస్తున్నారని అన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పంచాయతీల్లో పరిస్థితి పర్యవేక్షించి అధికారులకు దిశానిర్దేశం చేస్తున్నారన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు ముంపు ప్రాంతాల్లో తిరుగుతున్నారని తెలిపారు. ప్రతిరోజూ ఆహారం, నీరు, బ్రెడ్, పాలు రెండు మూటలా అందిస్తున్నారన్నారు. ఇప్పుడు నిత్యావసర వస్తువులు నెల రోజుకు సరిపడా ఇస్తున్నారన్నారు.

ప్రతి ఇంటికి నిత్యావసర సరుకుల పంపిణీ 100 శాతం జరిగేలా మంత్రులు ఆదేశించారు. వరద బాధితులకు 25 కిలోల బియ్యం, కిలో కందిపప్పు, కిలో పంచదార, 2 కిలోల ఉల్లిగడ్డలు, 2 కిలోల బంగాళాదుంపలు, లీటర్ పామాయిల్ పంపిణీ చేస్తున్నారు.

# జగనన్న తీసుకొచ్చిన వాహనాలు విజయవాడ ప్రజలను గట్టెక్కిస్తున్నాయి: రోజా

విజయవాడ సెప్టెంబర్ 6 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: నేడు మంత్రులు ఇంటింటికీ నిత్యావసర సరకుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిం చారు. విశేషం ఏమిటంటే ఈ కార్యక్ర మానికి నాడు ముఖ్యమంత్రి జగన్ తెచ్చిన వాహనాలే ఉపయోగపడు తున్నాయి. దీనిపై వైసిపి నేత రోజా స్పందించారు. జగనన్న తీసుకొచ్చిన రేషన్ వాహనాలు, జగనన్న తీసుకొచ్చిన సచివాలయ వ్యవస్థ, జగనన్న నియమించిన సచివాలయ ఉద్యోగులు, జగనన్న నియమించిన వాలంటీర్ వ్యవస్థ, జగనన్న కట్టించిన రిటైనింగ్ వాల్, జగనన్న హయాంలో కొను గోలు చేసిన 108, 104 వాహనాలు, జగనన్న తీసుకొచ్చిన క్లీన్ ఆంధ్రా వాహనాలు, జగనన్న తీసుకొచ్చిన వైఎస్ఆర్ హెల్త్ సెంటర్లు, ఈరోజు విజయవాడ ప్రజలను వరద కష్టాల నుంచి గట్టెక్కిస్తున్నాయి అంటూ రోజా ట్వీట్ చేశారు. అంతేకాక విజయవాడ రోడ్లపై బారులు తీరిన రేషన్ వాహనాల వీడియోలను కూడా రోజా పంచుకున్నారు.

# వరద సహాయ చర్యలపై చంద్రబాబు సమీక్ష..

**-బుడమేరు మూడో గండి పూడ్చివేతలో ఆర్మీ సిబ్బంది**
**-పారిశుద్యం పనులు వేగవంతం చేయాలని పిలుపు**
**-నిత్యావసరాలు అందరికీ అందాలని ఆదేశం**
**-మెకానిక్లను, టెక్నీషియన్లను ఇతర ప్రాంతాల నుంచి రప్పించాలి**
**-రెండు రోజులలో మొత్తం చక్కబడాలి**
**-ఏ చిన్న ఫిర్యాదు వచ్చిన యాక్షన్ కఠికంగా ఉంటుంది..**

అమరావతి, సెప్టెంబర్ 6 :విజయవాడలో ఆరవ రోజు వరద సహాయక చర్యలపై మంత్రులు, అధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వరద ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను సీఎంకు అధికారులు వివరించారు.



ఫైరింజన్లతో రోడ్లు, కాలనీలు, ఇళ్లు క్లీనింగ్ ను మరింత వేగవంతం చేయాలని చంద్రబాబు సూచించారు. బుడమేరుకు పడిన గండ్లు పూడ్చివేత పనుల ప్రోగ్రెస్ ను అడిగి తెలుసుకున్నారు. అలాగే, బుడమేరు వాగుకు గండ్లపూడ్చి వేత కార్యక్రమంలో రంగంలోకి దిగిన భారత ఆర్మీకి చెందిన ఇంజనీరింగ్ టాస్క్ ఫోర్స్ విభాగం.. యద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టి.. ఇప్పటికే రెండు గండ్లు పూడ్చినట్లు సీఎం కు అధికారులు తెలిపారు. ఇక, అత్యంత క్లిష్టంగా ఉన్న మూడో గండి పూడ్చివేత పనులను ఆర్మీ అధికారుల సహకారంతో వేగం గా చేస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబా బుకు అధికారులు తెలిపారు. అన్ని విభాగాల సమన్వయంతో మూడో గండి పూడ్చివేత పనులు త్వరగా పూర్తి చేయలన్నారు. కరెంట్ సరఫరా, టెలి ఫోన్ సిగ్నల్స్ పునరుద్దరణ, ట్యాంకర్లతో తాగునీటి సరఫరా వివరాలు తెలుసుకున్నారు.

అందరికీ నిత్యావసరాలు అందాలి..

నిత్యావసరాతో కూడిన ఆరు వస్తువుల పంపిణీపైనా కూడా ఆయన సమీక్ష చేశారు. ఇప్పటికే ప్యాకింగ్ పూర్తి చేసి బాధితులకు అందిస్తున్నట్లు అధికార యంత్రాంగం వెల్లడించింది. వాహనాలు, ఇళ్లల్లో ఎలక్ట్రానిక్ వస్తువులు దెబ్బతిన్న నేపథ్యంలో ఇతర ప్రాంతాల నుంచి టెక్నీషియన్ల ను పిలిపించాలని సీఎం సూచించారు. అవసరం అయితే కొంత పారితోషికం ఇచ్చి అయినా మెకానిక్లను, టెక్నీషియన్లను ఇతర ప్రాంతాల నుంచి తీసుకురావాలని చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

# విశ్వస్య-బ్లాక్ చెయిన్ సాంకేతిక వ్యవస్థను ప్రారంభించిన ప్రభుత్వం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 6 :విశ్వస్య-బ్లాక్ చెయిన్ టెక్నాలజీ స్టాక్‌ను కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ (ఎంఈఐటివై) లో ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో ఎంఈఐటీవై కార్యదర్శి శ్రీ ఎస్. కృష్ణన్ ప్రారంభించారు. భౌగోళికంగా విస్తరించి ఉన్న మౌలిక సదుపాయాల ఆధారంగా బ్లాక్ చెయిన్ సర్వీస్‌ను అందించేందుకు అనుమతించిన వివిధ బ్లాక్‌చెయిన్ ఆధారిత పనులకు మద్దతు ఇస్తుంది.

తక్కువ ఫీచర్లున్న బ్లాక్ చెయిన్ ప్లాట్‌ఫామ్- ఎన్బీఎఫ్ లైట్, మొబైల్ యాప్ పుట్టుపూర్వోత్తరాలను గుర్తించ గలిగిన బ్లాక్ చెయిన్ ఆధారిత యాప్- ప్రామాణిక్ ను, జాతీయ బ్లాక్ చెయిన్ పోర్టల్‌ని ఆయన ప్రారంభించారు.

ఎంఈఐటీవై విశ్వసనీయ డిజిటల్ అప్లికేషన్లను రూపొందించే దృష్టితో- పరిశోధన, ఇతర ప్రయోజనాలను సాధించే దిశగా నేషనల్ బ్లాక్ చెయిన్ వ్యవస్థ (ఎన్బిఎఫ్)ను ప్రారంభించింది. దీనివల్ల పౌరులకు అత్యాధునికమైన, పారదర్శకమైన, సురక్షితమైన, విశ్వసనీయమైన డిజిటల్ సేవల్ని అందించడం సాధ్యం అవుతుంది.

నేషనల్ బ్లాక్ చెయిన్ వ్యవస్థ టెక్నాలజీ స్టాక్ డిస్ట్రిబ్యూటెడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, కోర్ ఫ్రేమ్‌వర్క్ ఫంక్షనాలిటీ, స్మార్ట్ కాంట్రాక్టులు, ఏపిఐ గేట్‌వే, సెక్యూరిటీ, ప్రైవసీ, ఇంటర్‌ఆపరబిలిటీ, అప్లికేషన్ల అభివృద్ధితో బ్లాక్ చెయిన్‌ను ఒక సేవగా (బాస్) అందిస్తోంది. ఎన్బీఎఫ్ ప్రస్తుతం రెండు అనుమతించిన బ్లాక్ చెయిన్ వ్యవస్థలకు మద్దతు ఇస్తుంది. దీనిని ఇంకా విస్తరించే అవకాశం ఉంది. సాంకేతికంగా ఈ స్టాక్ ఎన్ఐసి డేటా సెంటర్లలో అంటే భువనేశ్వర్, పూణే, హైదరాబాద్‌లో భౌగోళికంగా విస్తరించి ఉన్న మౌలిక సదుపాయాలతో కలిసి ఉంది.

అంకుర సంస్థలు, విద్యారంగం కోసం బ్లాక్ చెయిన్ శాండ్ బాక్స్

ఎన్బీఎఫ్ లైట్ అనేది బ్లాక్ చెయిన్ శాండ్‌బాక్స్ అప్లికేషన్. ప్రత్యేకించి అంకుర సంస్థలు/విద్యారంగం కోసం అప్లికేషన్ల వేగవంతమైన ప్రోటో టైపింగ్, పరిశోధన, సామర్థ్యాన్ని పెంపొందించడం కోసం అభివృద్ధి చేశారు. ఎంఈఐటీవై మద్దతు కింద సి-డాక్, ఎన్ఐసీ, ఐడిఆర్బిటి హైదరాబాద్, ఐఐటీ హైదరాబాద్, ఐఐఐటీ హైదరాబాద్, ఎస్ఈటీఎస్ చెన్నై ప్రయత్నాల సహకారంతో ఈ సాంకేతికతలు అభివృద్ధి అయ్యాయి.

పౌరులకు భద్రత, పారదర్శకతను పెంచడానికి జాతీయ బ్లాక్ చెయిన్ వ్యవస్థ

విశ్వసనీయమైన డిజిటల్ సేవల్ని అందించేందుకు కోసం కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా, వివిధ పౌర సేవలకు భద్రత, నమ్మకం, పారదర్శకతను కల్పించడంలో నేషనల్ బ్లాక్ చెయిన్ వ్యవస్థ ముఖ్య పాత్ర పోషిస్తుందని ఎంఈఐటీవై కార్యదర్శి శ్రీ ఎస్ కృష్ణన్ తెలిపారు. బ్లాక్ చెయిన్ టెక్నాలజీలో భారతదేశాన్ని గ్లోబల్ లీడర్‌గా ఉంచడం, ప్రపంచ స్థాయిలో సేవలు అందించడం కోసం అభివృద్ధి చెందిన పరిష్కారాలను విస్తరించడం, ఆర్థిక వృద్ధి, సామాజికాభివృద్ధి, డిజిటల్ సాధికారత కోసం దీనిని ఉపయోగించుకోవడం వాటాదారులు లక్ష్యంగా పెట్టుకోవాలని ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు.

పాలనలో మార్పులను తేవడంలో బ్లాక్ చెయిన్ పాత్ర

ప్రజలకు అందించే సేవల్ని మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా, జవాబుదారీగా చేయడం ద్వారా దేశంలోని పాలనలో మార్పులు తేవడానికి బ్లాక్ చెయిన్ టెక్నాలజీ అపారమైన సామర్థ్యాన్ని కలిగి ఉందని ఎంఈఐటీవై అదనపు కార్యదర్శి శ్రీ భువనేష్ కుమార్ అన్నారు. వివిధ రాష్ట్రాలు, విభాగాలల్లో ఎన్బీఎఫ్ లో అప్లికేషన్లను విస్తృతంగా ఉపయోగించాల్సిన అవసరాన్ని ఆయన వివరించారు. ఎన్బీఎఫ్ స్టాక్‌లో కొత్త అప్లికేషన్స్/ ప్లాట్‌ఫారమ్‌లు / వినూత్న భాగాలను ప్రారంభించాలని కూడా సూచించారు.

సవాళ్లను ఎదుర్కోవడానికి ఎన్బీఎఫ్ లక్ష్యాలు

బ్లాక్ చెయిన్‌ను నిర్మించడంలో నిపుణులు అవసరం ఉంటుంది. ఈ సవాళ్లను పరిష్కరించడానికి పంపిణీ చేయబడిన మౌలిక సదుపాయాలపై బ్లాక్ చెయిన్ టెక్నాలజీ స్టాక్‌తో విస్తరించదగిన ఫ్రేమ్‌వర్క్ ను అభివృద్ధి చేయడం జాతీయ బ్లాక్ చెయిన్ ఫ్రేమ్ వర్క్ (ఎన్బీఎఫ్) ఉద్దేశమని ఎంఈఐటీవైలో ఎలక్ట్రానిక్స్, ఐటీ పరిశోధన, అభివృద్ధి విభాగం గ్రూప్ కోఆర్డినేటర్, సైంటిస్ట్ 'జి' శ్రీమతి సునీతా వర్మ అన్నారు. నైపుణ్యం గల మానవ వనరులు, బ్లాక్ చెయిన్ ఆధారిత అప్లికేషన్లు, వెండర్ లాక్-ఇన్, భద్రత, ఇంటర్ ఆపరబిలిటీ, వనితీరు, ఇతర అంశాలకు సంబంధించిన పరిశోధన సవాళ్లకు బ్లాక్ చెయిన్ సాంకేతిక స్టాక్ అభివృద్ధి ముఖ్యమని ఆమె తెలిపారు.

ఎన్బీఎఫ్ అనేది పరిశోధనా సవాళ్లను ఎదుర్కోవడానికి, ప్రభుత్వ సంస్థలతో కలిసి అప్లికేషన్లను అభివృద్ధి చేయుడానికి, సాంకేతికత ప్రయోజనాలను ఉపయోగించడం కోసం ఒక కన్సార్టియం మాదిరి ప్రయత్నం అని సి-డాక్ డైరెక్టర్ జనరల్ ఈ.మాగేష్ అన్నారు. ఈ చొరవలో భాగంగా అనేక పేటెంట్లు, పరిశోధన ప్రచురణలు రూపొందించినట్లు ఆయన తెలిపారు.

నేషనల్ బ్లాక్ చెయిన్ ఫ్రేమ్‌వర్క్ వివిధ సాంకేతిక లక్షణాల గురించి సి-డాక్ హైదరాబాద్ సెంటర్ హెడ్ శ్రీమతి వీఆర్ లక్ష్మీ ఈశ్వరి వివరించారు. మొబైల్ యాప్ మూలాన్ని ధ్రువీకరించడానికి ప్రామాణిక్ - బ్లాక్ చెయిన్ ఎలా పని చేస్తుందో వివరించారు.

# జలాంతర్గాముల రక్షణ, విస్తృత సహకారంపై భారత, దక్షిణాఫ్రికా నౌకాదళాల ఒప్పందం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 6 :దక్షిణాఫ్రికా జలాంతర్గాముల సిబ్బంది ప్రమాదంలో చిక్కినపుడు వారిని రక్షించే విషయమై, భారత-దక్షిణాఫ్రికా నావికా దళాలు తక్షణమే అమలుచేయాల్సిన ప్రాతిపదికన ఒక సహకార ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. దక్షిణ ఆఫ్రికా నౌకాదళానికి చెందిన జలాంతర్గామి సిబ్బంది ఆపదలో చిక్కుకున్నప్పుడు గాని, లేదా ఏదైనా దుర్ఘటనకు లోనైనప్పుడు గాని వారిని కాపాడడానికి ఈ ఒప్పందం ఉపయోగపడుతుంది. ఈ ఒప్పంద పత్రంపైన భారతీయ నౌకాదళం ప్రధానాధికారి అడ్మిరల్ దినేశ్ కె. త్రిపాఠి, దక్షిణాఫ్రికా నౌకాదళం ప్రధానాధికారి వైస్ అడ్మిరల్ మోండే లోబేస్ సంతకాలు చేశారు. సముద్ర వాణిజ్య భద్రత, పరస్పర సహకారంలో ఇరుదేశాల నిబద్ధతకు ఈ ఒప్పందం అద్దం పడు తున్నది. ఈ ఒప్పందంలో భాగం గా- భారతీయ నౌకాదళం అవసరమైనప్పుడు తన డీప్ సబ్‌మర్జెన్స్ రెస్క్యూ వెహికల్ (డిఎస్ఆర్వి)ని రంగంలోకి దించి సహాయాన్ని అందిస్తుంది. ఇది రెండు దేశాల స్నేహ పూర్వక సంబంధాలనే కాకుండా, సముద్ర వాణిజ్యంలో- ఇరుదేశాల మధ్య ఉన్న సంబంధాలను ఈ ఒప్పందం మరింత దృఢతరం చేస్తోంది.

# క్యాన్సర్ చికిత్సలో నూతన ఉష్ణ ఆధారిత విధానం కీమో థెరపీ డోసుల తగ్గుదల

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 6 :క్యాన్సర్ చికిత్స కోసం - విద్యుదయస్కాంత శరీర ఉష్ణోగ్రత (మాగ్నెటిక్ హైపోథెర్మియా)నూ, అతి సూక్ష్మ విద్యుదయస్కాంత సూక్ష్మ కణాలను (ఓఆలు), హీట్ షాక్ ప్రోటీన్ 90 ఇన్హిబిటర్ (ఊఖ90తి) కలయికను తగిన మోతాదులో పరిశోధకులు ఉపయోగించారు. అవసరమైన కీమోదెరపీ మోతాదును తగ్గించడం ద్వారా చికిత్స సామర్థ్యాన్ని ఈ సాంకేతికత గణనీయంగా పెంచుతుంది. ఇది దుష్ప్రభావాలను తగ్గించే సహాయక చికిత్సగా ఉపయోగపడుతుంది.

ప్రపంచవ్యాప్తంగా క్యాన్సర్ కేసులు పెరుగుతున్నందున, కొత్త చికిత్సా పద్ధతుల అవసరం చాలా కీలకంగా మారింది. కీమోథెరపీ, శస్త్రచికిత్స వంటి సంప్రదాయ చికిత్సలు ఔషధ నిరోధకతకు దారి తీస్తున్నాయి. అంతే కాదు తీవ్రమైన దుష్ప్రభావాల కారణంగా వాటికి పరిమితులు ఏర్పడ్డాయి. ఈ సవాళ్లను పరిష్కరించడానికి, మన శాస్త్రవేత్తలు తక్కువ దుష్ప్రభావాలను కలిగి ఉండే నానోథెరపీ వంటి వినూత్న చికిత్సలను అభివృద్ధి చేస్తున్నారు.

మొహాలీలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నానో సైన్స్ అండ్ టెక్నాలజీ (ఏఐూ) కేంద్ర శాస్త్ర సాంకేతికశాఖకు చెందిన స్వయంప్రతిపత్త సంస్థ. ఈ సంస్థకు చెందిన శాస్త్రవేత్తలు హీట్ షాక్ ప్రోటీన్ 90 (ఊఖ90) నిరోధకం అయిన 17 డిఎంఏజిని( 17-ఆఓంఉ ) , మాగ్నెటిక్ హైపోథెర్మియా-ఆధారిత క్యాన్సర్ థెరపీ (ఓఊఅు)తో కలిపి తయారు చేసిన కాంబినేషన్ థెరపీ ద్వారా వేడి-ఆధారిత క్యాన్సర్ చికిత్సల ప్రభావాన్ని మెరుగుపరుస్తున్నారు. క్యాన్సర్ కణాల్లోకి ఇంజెక్షన్లు ఇచ్చి కాంబినేషన్ థెరపీ ద్వారా జంతు నమూనాలపై ప్రయోగాలు చేశారు. ఇందులో ఎలుక గ్లియోమా మోడల్‌లో గరిష్ట గ్లియోమా కణాలు (క్యాన్సర్ కణాలుగా మారేవి) మరణించాయి. 8 రోజులలోపు ట్యూమర్ నిరోధకత రేట్లు ప్రాథమిక, ద్వితీయ క్యాన్సర్ ఉన్న కణజాలంలో వరుసగా 65% , 53%కి చేరాయి.

ఏపీఎస్ నానోలో ప్రచురితమైన పద్ధతి తక్కువ హానికరం. తక్కువ దుష్ప్రభావాలను కలిగిస్తుంది. ఎంఎన్పీలు, ప్రత్యామ్నాయ అయస్కాంత క్షేత్ర ప్రభావానికి (ంఓఈ) గురైనప్పుడు, కణతులను సమర్థవంతంగా ఎదుర్కోగలవని పరిశోధనా బృందం నిరూపించింది. ఈ మిశ్రమ మాగ్నెటిక్ హైపెథెర్మియా , కీమోథెరపీ (ఓఊఅు) విధానం అవసరమైన మొత్తంలో కీమోథెరపీని తగ్గిస్తుంది. కాన్సర్ చికిత్సను సురక్షితంగా, మరింత ప్రభావవంతంగా చేస్తుంది. దీనికి అదనంగా, ఈ చికిత్స రెండో స్థాయి క్యాన్స కణజాలంలో అదనపు మోతాదు అవసరం లేకుండా సుదూర కణతులకు చికిత్స చేయగలదు. దాంతో ఇది అత్యంత ప్రభావవంతమైన క్యాన్సర్ చికిత్సగా పేరు పొందుతోంది.

ఈ నూతన చికిత్సను అమల్లోకి తేవడానికిగాను ప్రపంచ వ్యాప్తంగా విస్తృత పరిశోధన అవసరం. ఇది సహాయక లేదా ప్రత్యామ్నాయ క్యాన్సర్ చికిత్సను అభివృద్ధి చేయగలదు. ఈ అధ్యయనం మరింత సమర్థవంతమైన, భరించగలిగే క్యాన్సర్ చికిత్సలకు మార్గం సుగమం చేస్తుంది, ఈ చికిత్స మిలియన్ల మంది రోగులకు గణనీయమైన ప్రయోజనాలను అందిస్తుంది. అంతే కాదు హైపోథెర్మియా ఆధారిత చికిత్సలకు కొత్త దిశను అందిస్తుంది.

ఈ సవాలును పరిష్కరించడానికి, డాక్టర్ దీపికా శర్మ నేతృత్వంలోని పరిశోధనా బృందం ఊఖ90 అనే జీన్ పాత్రపై పరిశోధనలు చేసింది. ఈ జీన్ వేడి ఒత్తిడికి ప్రతిస్పందనగా నియంత్రితమవుతుంది. ఔషధం 17-ఆఓంఉని ఉపయోగించి ఊఖ90ని నిరోధించడం ద్వారా, వారు వేడి-ప్రేరిత నష్టాన్ని సరిచేసే కణాల సామర్థ్యాన్ని తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. తద్వారా మెరుగైన క్యాన్సర్ కణతి కణాలు మరణిస్తున్నాయి.

వారి కృషి అసాధారణమైన ఉష్ణ ఉత్పత్తి సామర్థ్యాలతో అతి సూక్ష్మ విద్యుదయస్కాంత కణాలను సృష్టించడం, ఊఖ90 ఇన్హిబిటర్ డెలివరీని అవసరమైన స్థాయికి తీసుకుని రావడంపై దృష్టి సారించింది.

ఈ వినూత్న చికిత్స ముఖ్య ప్రయోజనం రోగనిరోధక వ్యవస్థను ఉత్తేజపరిచే సామర్థ్యం రోగిలో కలగడం. క్యాన్సర్‌కు వ్యతిరేకంగా శరీర సహజ రక్షణను ఈ చికిత్స మెరుగుపరుస్తుంది. క్యాన్సర్ చికిత్సలో ఇంతకాలం సాధారణ సవాలుగా ఉన్న ఔషధ నిరోధకతను అధిగమిస్తారు. తద్వారా, ఈ విధానం క్యాన్సర్ ను ఎదుర్కోవడంలో సరికొత్త చికిత్సగా నిలవబోతున్నది.

ఈ చికిత్స కారణంగా సైటోకైన్ స్రావం జరిగి అది రోగనిరోధక ప్రతిస్పందనను క్రియాశీలం చేస్తుందని పరిశోధకులు ఊహిస్తున్నారు. అంతే కాదు ఈ చికిత్స క్యాన్సర్ నిరోధక ప్రభావాలను మరింత మెరుగుపరుస్తుంది.

# ఆన్‌లైన్ లోన్ యాప్ వేధింపులు

## – చెరువులో దూకి యువకుడి ఆత్మహత్య

హైదరాబాద్ సెప్టెంబర్ 6 (ఎక్స్ ప్రెస్స్ న్యూస్ );: మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ లో పిజి విద్యార్థి ఆన్‌లైన్ లోన్ యాప్ వేధింపులు తట్టుకోలేక చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం? సంజయ్ గాంధీ నగర్ లో ఎంకే విద్యార్థి భాను ప్రకాష్ (22) ఆరోరా కళాశాలలో మాస్టర్స్ చదువుతున్నాడు. ఇటీవల లోన్ అప్స్ వేధింపుల తాళలేక మదన పడుతున్న భాను గురువారం సాయంత్రం ఫాక్స్ సాగర్ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మొబైల్ లోకేషన్ ద్వారా ఆచూకీ కనుగొన్న స్నేహితులు చెరువు వద్దకు వెళ్లి చూడగా అతని దుస్తులు, వాహనం కనిపించాయి. ఈ మేరకు పోలీసులకు పిర్యాదు చేయడంతో శుక్రవారం ఉదయం గాలింపు చేపట్టగా చెరువులో భాను మృత దేహం లభ్యమైంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.




కరీంనగర్ కథలు

14 సెప్టెంబర్, 2024 శనివారం, ఉ. 10.30 ని.లకు
వేదిక: రంగినేని ట్రస్టు, కరీంనగర్ రోడ్, సిరిసిల్ల

సభాధ్యక్షులు
శ్రీ రంగినేని మోహన్ రావు
అధ్యక్షులు, రంగినేని ఎల్లమ్మ పురస్కార కమిటి
రేగులపాటి లక్ష్మి పిల్లల పండుగ

ముఖ్య అతిథి
ఆచార్య సి. మృణాళిని
కన్వీనర్, సాహిత్య అకాడమి తెలుగు సలహా మండలి

విశిష్ట అతిథి
శ్రీ అల్లం రాజయ్య
ప్రసిద్ధ కథా రచయిత

వక్త
ఆచార్య సి. కాశీం
తెలుగుశాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్

కథా సంకలనం ప్రస్తావన
డా. నలిమెల భాస్కర్
శ్రీ జూకంటి జగన్నాథం
సంపాదకుల పక్షాన

వందన సమర్పణ
శ్రీ రంగినేని నవీన్ కుమార్
అధ్యక్షులు, రంగినేని ట్రస్ట్, సిరిసిల్ల

ఆహ్వానించువారు
ప్రకాశకులు, రంగినేని చారిటబుల్ ట్రస్ట్
ఫోన్: 92906 87853, 98490 12459

రంగినేని సుజాతా మోహన్ రావు
ఎడ్యుకేషనల్ & చారిటబుల్ ట్రస్ట్, సిరిసిల్ల

కరీంనగర్ కథలు

సంపాదకవర్గం
జూకంటి జగన్నాథం । డా. నలిమెల భాస్కర్
పెద్దింటి అశోక్ కుమార్ । డా. పత్తిపాక మోహన్
మద్దికుంట లక్ష్మణ్ । గరిపెల్లి అశోక్

పుస్తక పరిచయ సభ



# “వినాయక చవితి”

(హిందువుల ప్రత్యేక పండుగ)




-శారద శృంగేరి
9490 26 1119


శ్లో॥ శుక్లాంబరధరం విష్ణుం
శశివర్ణం చతుర్భుజం।
ప్రసన్నవదనం ధ్యాయేత్ సర్వ
విఘ్నోపశాంతయే॥
అగజానన పద్మార్కం గజానన
మహర్నిశం।
అనేక దం తం భక్తానాం
ఏకదంత ముపాస్మహే॥

## పండుగ ప్రస్తావన:

“వినాయక చవితి”, హిందువుల ముఖ్య పండుగలలో ఇది ముఖ్యమైన పండుగ. పార్వతి, పరమేశ్వరుల కుమారుడైన వినాయకుని పుట్టినరోజునే ‘వినాయక చవితి’గా జరుపుకుంటారు. భాద్రపదమాసం శుక్ల చతుర్థి మధ్యాహ్న శుభ సమయంలో హస్త నక్షత్రం రోజున చవితి ఉత్సవాలు ప్రారంభమవుతాయి. హిందూధర్మశాస్త్రం ప్రకారం గణపతి నవరాత్రులు ప్రతిరోజూ వినాయకుని వేద శ్లోకాలు, ప్రార్థనలు, పూజలు, నైవేద్యాలు సమర్పిస్తూ, దేశ వ్యాప్తంగాను ప్రపంచంలోని హిందు మతస్తులు అంగరంగ వైభవంగా వినాయక చవితి పర్వదినాన గణపతికి తొలిపూజ జరుపుకుంటారు.

## చరిత్ర :

1892 లో ప్రజా వ్యతిరేక అసెంబ్లి చట్టం ద్వారా హిందూ సమావేశాలపై బ్రిటిష్ ప్రభుత్వం నిషేధాన్ని విధించింది. భారతీయ స్వాతంత్ర్య సమరయోధుడు లోకమాన్య తిలక్, బ్రిటీష్ వారిపై తిరుగుబాటులో భాగంగా భారత స్వాతంత్ర్యోద్యమానికి మద్దతుగా ప్రజలందరిలో జాతీయ స్ఫూర్తి రగిలించే ఏ చిన్న అవకాశాన్ని వినియోగించు కొవాల్సిన ఉద్యమ ఆవశ్యకతను గుర్తించి, దేశవ్యాప్తంగా అందరినీ ఏకం చేసే సంకల్పంతో చేసిన ఉత్సవం. వినాయక చవితి, నేటికీ నిరంతరంగా సాగుతున్న గణపతి ఉత్సవాలు. శివాజీ మొదటిసారిగా ఈ ఉత్సవాలను ప్రారంభించారు. గణపతిని పూజించడం వలన శాంతి, జ్ఞానం, శ్రేయస్సును పొందేందుకు ఓం గం గణపతియే నమః అని శ్లోకం పఠిస్తారు. ఏ కార్యక్రమానికైన హిందువులు తొలిగా గణేశుని పూజించే సాంప్రదాయం ఆచరణీయంగా మారింది.

## పండుగ కోలాహలం:

హిందువులు ‘వినాయకచవితి’ పండుగకు ఎంతో ప్రాముఖ్యతనిస్తారు. ప్రతినిత్యం ఎవ్వరి పనులలో వారు తీరికలేకుండా ఉన్నప్పటికీ, ఈ పండుగకు కుటుంబంలోని ప్రతిఒక్కరూ అత్యంత శ్రద్ధతో, ఆధ్యాత్మిక చింతనతో కుటుంబం యావత్తు వినాయకుని భక్తితో కొలిచి స్తుతించి శరణు వేడుతారు. వినాయక చవితి వస్తుందంటే ఆ కోలాహలమే వేరు. విఘ్నేశ్వరుడిని ప్రతిష్ఠించిన దగ్గరి నుంచి నిమజ్జనం వరకు తొమ్మిది రోజులు పూజలు, సేవలతో ఇండ్లలోనూ, వీధిలన్నింటిలో హడావిడి మొదలవుతుంది. పురాణాల ప్రకారం విఘ్నేశ్వరుడికే తొలి పూజ అనాదిగా వస్తున్న సంప్రదాయం. ఎందుకంటే, విఘ్నాలను తొలగించే విఘ్నాధిపతి. ప్రతి ఏడాది వినాయక చవితి భాద్రపద శుక్లపక్ష చవితినాడు జరుపుకోవాలి. ఈ రోజు విఘ్నేశ్వరుడిని పూజించడం వల్ల విఘ్నములు తొలుగుతాయని, చేపట్టిన కార్యంలో విజయం సాధిస్తారని భక్తులు విశ్వసిస్తారు. తెలుగురాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్లోనూ, ముఖ్యంగా జంటనగరాలైనా హైదరాబాద్, సికింద్రాబాదు ప్రాంతాలలో అత్యంత ప్రాముఖ్యతనిచ్చే పండుగగా ‘గణేష్ చతుర్థి’ మరింత ఉత్సాహంగా పిల్లపాపలతో సహా ఉత్సవంలో పాల్గొంటారు. హైదరాబాద్‌లోని ఖైరతాబాద్‌లో ప్రతిష్ఠించే వినాయకుని చూసేందుకు భక్తులు పలుప్రాంతాలనుండి తరలివస్తారు. భక్తుల సౌకర్యార్థం రాష్ట్రప్రభుత్వం పలు జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతుంది. హైదరాబాద్ మహానగరంలో ఏటా గణేశ్ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు. అందులో ఖైరతాబాద్ గణేశుడిది ప్రత్యేక స్థానం. ప్రతి ఏడాది ఒక ప్రత్యేక అవతారంలో దర్శనమిచ్చే గణనాధుడు ఈసారి శ్రీ సప్తముఖ మహా శక్తి గణపతిగా భక్తులకు దర్శనమివ్వనున్నాడు. విగ్రహ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి.

ఖైరతాబాద్ వినాయకుడు ఈ ఏడాది సప్తముఖ మహాశక్తి గణపయ్యగా పూజలందుకోనున్నాడు. ఉత్సవాలు ప్రారంభమై 70 ఏళ్లు పూర్తయిన సందర్భంగా 70 అడుగుల భారీ విగ్రహాన్ని రూపొందిస్తున్నారు. అందులో ఖైరతాబాద్ గణేశుడిది ప్రత్యేక స్థానం. ప్రతి ఏడాది ఒక ప్రత్యేక అవతారంలో దర్శనమిచ్చే గణనాధుడు ఈసారి శ్రీ సప్తముఖ మహా శక్తి గణపతిగా భక్తులకు దర్శన మివ్వనున్నారు

ఖైరతాబాద్ మహా గణపతిని 1954లో తొలిసారిగా ప్రతిష్ఠించారు. ఖైరతాబాద్ లంబోదరుడు ప్రతి ఏడాది ఓ ప్రత్యేక అవతారంలో దర్శనమిస్తాడు. ఈ ఏడాదితో ఖైరతాబాద్ మహాగణపతి 70 ఏళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా 70 అడుగుల మట్టి వినాయకుడిని ప్రతిష్ఠించాలని నిర్వాహకులు నిర్ణయించారు. ప్రతి ఏడాది గణేశ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్మాణ పనులు కొనసాగుతుంటాయి. ఈసారి శ్రీ సప్తముఖ మహా శక్తి గణపతిగాఏడు ముఖాలతో, ఏడు సర్పాలతో, 24 చేతులతో గణేషుడి నిర్మాణం కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. గణనాథుడికి కుడి వైపున శ్రీనివాస కళ్యాణం, ఎడమ వైపున శివ పార్వతుల కళ్యాణం ఏర్పాటు చేయనున్నారు. ఇక ప్రత్యేక ఆకర్షణగా అయోధ్య బాల రాముడి ప్రతిమను ఏర్పాటు చేయనున్నారు. వినాయకుడి ప్రతిమను తయారు చేయడానికి మహారాష్ట్ర, వెస్ట్ బెంగాల్, ఒడిశా, తమిళనాడు, తెలంగాణ నుంచి వచ్చారు. గత ఐదారు సంవత్సరాల నుంచి మట్టి గణపతి అని నిర్ణయించారు. మట్టిగణపతి శోభాయాత్ర అంటే కొంచెం సమస్య అయితే ఇప్పుడు తయారు చేస్తున్న గణేశుడు ఐదు గంటలు తడిచినా ఏమీ కాదన్నారు.” ఒడిశా కళాకారుడు.

70సంవత్సరాలకు 70 అడుగుల :ఖైరతాబాద్‌లో ఈ ఏడాది 70 అడుగుల మట్టి గణపతిని ప్రతిష్టిస్తున్నారు. దీంతో విగ్రహ తయారీ పనులు జూన్‌లోనే ఊపందుకున్నాయి. సుమారు 22 టన్నుల పైచిలుకు ఐరన్‌ను విగ్రహతయారీలో వినియోగిస్తున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. మహా గణపతి నిర్మాణంలో మంచి నాణ్యత గల వస్తువులను వినియోగిస్తున్నట్లు కళాకారులు తెలిపారు. ఈ మహాగణేశుడిని దర్శించుకునేందుకు నగరవాసులే కాదు రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివస్తుంటారు. వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు చెప్పారు. గతేడాది ఖైరతాబాద్ మహా గణపతిని 35 లక్షల పైచిలుకు భక్తులు దర్శించుకున్నారు. ఈ ఏడాది మరింత మంది భక్తులు పెరిగే అవకాశం ఉందని ఉత్సవ సమితి నిర్వాహకులు అంచనావేస్తున్నారు.

‘శ్రీ సప్తముఖ మహా శక్తి రూపంలో దర్శనమివ్వనున్న ఖైరతాబాద్ గణేష్’

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఖైరతాబాద్ గణేషుడు ఈ ఏడాది శ్రీ సప్తముఖ మహాశక్తి గణపతిగా దర్శనమివ్వనున్నాడు. ఖైరతాబాద్ గణనాథుడిని ప్రారంభించి 70 ఏళ్లైనా సందర్భంగా 70 అడుగుల మట్టి విగ్రహాన్ని తయారు చేస్తున్నట్లు ఉత్సవ కమిటీ ప్రకటించింది. విగ్రహానికి సంబంధించిన నమూనా చిత్రాన్ని కమిటీ ఆవిష్కరించింది.

## విఘ్నాధిపతి వైశిష్ట్యం:

వినాయకుడిని విఘ్నాధిపతి అనీ, గణాధిపతి అనీ మనం స్తుతిస్తాం. అలాగే గణపతిని పూజించకుండా ఏ శుభకార్యం తలపెట్టం. మంగళకార్యాలలో విఘ్నాలు చోటు చేసుకోకుండా విఘ్నేశ్వరుడిని ఆరాధిస్తాం. ప్రతి పూజా కార్యక్రమాలలో శుక్లాంభరధరం... అంటూ పూజ ప్రారంభిస్తారు. అలాగే ఓం గణానాం త్వా... అంటూ గణపతి మంత్రాన్ని పఠిస్తాం. అయితే ఈ మంత్రార్థాన్ని తెలుసుకుంటే చాలా ఆశ్చర్యం వేస్తుంది. వినాయకుడి వైశిష్ట్యంలో సాహితీవేత్తలకు ఆసక్తికరమైన విషయం ఏమిటంటే కవులలో కూడా ఆయనే మేటి కవి. మేధావులలో సాటిలేని మేధావి. వేదాలకు నాయకుడు అన్న తర్వాత ఇక మేధాతనానికి కానీ, రచనా పటిమకుగానీ లోటు ఏం ఉంటుంది? అందుకేగా వ్యాస భగవానుడు మహాభారతాన్ని రాయటానికి వినాయకుడిని ఎంచుకుంది. అంతటి మహారచనను ఆపకుండా రాయగల శక్తి ఎవరికి ఉంది? అన్న ప్రశ్న తలెత్తినప్పుడు వినాయకుడు తప్ప ఎవరూ కనిపించలేదు. అందుకే ఘంటం ఆపకుండా రాయగల మహాశక్తిశాలి వినాయకుడిని మహాభారత రచనకు ఎంచుకున్నాడు వ్యాసుడు. అందుకే కవులకు, రచయితలకు, మేధావులకు ప్రాతః స్మరణీయుడు వినాయకుడు. ఓం గణానాం త్వా... అనే గణపతి మంత్రానికి అర్థం ఏమిటంటే, దేవగణాలకు అధిపతివి కనుక గణపతిగా పేరు గాంచిన ఓం గణాధిపా నిన్ను స్తుతించి ఆహ్వానం పలుకుతున్నాము. కవీం కవీనాం... కవులలో మేటి కవివి (కవి అంటే మేధావి అనే అర్థం కూడా ఉంది. అందుకే మేధావులలో సాటిలేని ఖ్యాతి గాంచినవాడవు అనే అర్థం కూడా వస్తుంది.) ఉపమ శ్రవః తమం అంటే సాటిలేని ఖ్యాతిగలవాడవు. జ్యేష్ఠ రాజం... శ్రేష్ఠులలో శ్రేష్ఠతముడవు. వేదాలకు నాయకుడవైన నీవు మా మా మొరలను ఆలకించి మమ్ము రక్షింప సత్వరం విచ్చేసి కటాక్షించు స్వామి. ఓ మహాగణపతి! నీకిదే మా నమస్సృతులు.

## వినాయక చవితి ముహూర్తం & పూజా విధానం

వినాయక చవితి రోజు వేకువనే లేచి ఇంటిని శుభ్రం చేసుకొని మామిడి ఆకుల తోరణం కట్టుకోవాలి. వాకిళ్ళను అలంకరించుకోవాలి. కుటుంబ సభ్యులంతా తలంటుకొని స్నానం చేయాలి. ఈ సందర్భంగా వినాయక చవితి వేడుకలను ఎప్పుడు జరుపుకోవాలనే పూర్తి వివరాలను ఇప్పుడు తెలుసుకుందాం.

సెప్టెంబర్ 7వ తేదీన గణేష్ చతుర్థి పూజలు, విగ్రహ ప్రతిష్ఠాపనకు అనుకూలమైన సమయం ఉదయం 11.03 నుంచి మధ్యాహ్నం 1.34 గంటల వరకు ఉంటుంది. ఈ విధంగా సెప్టెంబర్ 7వ తేదీన వినాయక ఆరాధనకు విగ్రహ ప్రతిష్ఠాపన కోసం పవిత్ర సమయం 2 గంటల 31 నిమిషాల పాటు శుభ ముహూర్తం ఉంటుంది. ఈ సమయంలో భక్తులు గణపతి బప్పను పూజించడం మంచిది.

## వినాయక చవితి ముగింపు తేదీ

ఈసారి సెప్టెంబర్ 17వ తేదీ మంగళవారం అనంత చతుర్దశి రోజున గణేష్ చతుర్థి ముగుస్తుంది. గణేశుడి విగ్రహాన్ని ఇంట్లో ఉంచి 10 రోజుల పాటు పూజించే వారు అనంత చతుర్దశి రోజున వినాయకుని నిమజ్జనం చేస్తారు. ఒక్కొక్కరి సంప్రదాయాన్ని అనుసరించి 3, 5, 7, 9 రోజులలో కూడా నిమజ్జనము చేస్తున్నారు.

ఈ ఏడాది వినాయక చవితి రోజున ఏర్పడనున్న శుభ యోగం

హిందూ క్యాలెండర్ ప్రకారం ఈ సంవత్సరం వినాయక చవితి రోజున అనేక శుభ యోగాలు కూడా ఏర్పడనున్నాయి. ఈ రోజున చిత్త నక్షత్రం, స్వాతి నక్షత్రం, బ్రహ్మయోగం, ఇంద్ర యోగంతో సర్వార్థ సిద్ధి యోగం ఏర్పడుతుంది. ఈ రోజు చిత్త నక్షత్రం మధ్యాహ్నం 12.34 వరకు ఉంటుంది. ఆ తర్వాత స్వాతి నక్షత్రం వస్తుంది. దీంతో పాటు ఈ రోజు సర్వార్థ సిద్ధి యోగంతో పాటు బ్రహ్మయోగం, ఇంద్రయోగం ఉంటుంది. సర్వార్థ సిద్ధి యోగం ఆగస్టు 8వ తేదీ మధ్యాహ్నం 12:34 నుంచి ఉదయం 6:15 వరకు ఉంటుంది.

## గణపతి విగ్రహం ప్రతిష్టాపన :

జ్యోతిష్యశాస్త్రం ప్రకారం మధ్య కాలంలో ఏదైనా శుభ సమయంలో మట్టి వినాయకుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించండి. ప్రతిష్ఠించే వినాయకుడి విగ్రహానికి కుడి వైపున తొండం ఉండాలి. ఇలా ప్రతిష్ఠించే విగ్రహం దగ్గర ఎలుక ఉండాలి. వినాయక విగ్రహం కూర్చున్న భంగిమలో ఉండాలి. వినాయకుని విగ్రహాన్ని ఇంటికి ఉత్తరం లేదా ఈశాన్య మూలలో ప్రతిష్ఠించాలి. ఈ ప్రదేశం స్వచ్ఛంగా, పవిత్రంగా ఉండాలి. గణేశుడి విగ్రహం పశ్చిమం వైపు ఉండాలి. చెక్క ప్లాట్‌ఫారమ్‌పై ఎరుపు లేదా పసుపు గుడ్డను పరచి దానిపై గణపతి విగ్రహాన్ని ప్రతిష్ఠించాలి. ఆ తర్వాత నిమజ్జనం సమయంలో మాత్రమే అక్కడ నుంచి గణేశుడి విగ్రహాన్ని తీసి సాంప్రదాయ పద్ధతిలో నిమజ్జనం చేయాలి.

గణపతి విగ్రహ స్థాపన సమయంలో మనస్సును పూర్తిగా నిర్మలంగా పవిత్రంగా ఉంచుకోండి. ఈ పండుగ సమయంలో ఇంట్లో స్వచ్ఛమైన, సాత్విక ఆహారాన్ని మాత్రమే తయారు చేయాలి. అన్ని రకాల తామసిక ఆహారాన్ని నిమజ్జనం వరకు తినొద్దు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం గణపతి విగ్రహాన్ని పూజించండి. ఆహారం సమర్పించండి. వినాయక విగ్రహ ప్రతిష్ఠించిన తర్వాత ఆచారాల ప్రకారం గణేశుడిని పూజించండి. చివరిగా హారతి ఇవ్వండి. దీని తర్వాత గణపతికి కుడుములు, ఉండ్రాళ్ళు వంటి ఆహారాన్ని నైవేద్యంగా సమర్పించండి. పూజ అనంతరం ఈ ప్రసాదం భక్తులకు పంపిణీ చేయండి.

## వినాయక వ్రతానికి కావలసిన పూజా సామగ్రి :

పసుపు, కుంకుమ, గంధం, అగరువత్తులు, కర్పూరం, తమలపాకులు, వక్కలు, పూలు, పూలదండలు, అరటిపండ్లు, కొబ్బరి కాయలు, బెల్లం లేదా పంచదార, పంచామృతాలు, తోరము, దీపారాధన కుందులు, నెయ్యి లేక నూనె, దీపారాధన వత్తులు వినాయకుడి ప్రతిమ, 21 రకాల ఆకులు, ఉండ్రాళ్ళు, పాయసం, భక్ష్యాలు. దేవుని గది వుంటే అందులో లేదా పరిశుభ్రమైన ప్రదేశంలో ఒక పీటవేసి, దానిపై మనం తెచ్చుకున్న వినాయకుడి విగ్రహాన్ని వుంచాలి. తెచ్చిన పూజా సామాగ్రిని కూడా అందుబాటులో వుంచుకోవాలి. వినాయకుడికి ఉండ్రాళ్ళు చాలా ఇష్టం. మిగిలిన భక్ష్యాలున్నా లేకున్నా వీటిని తప్పని సరిగా తయారు చేసుకోవాలి. వినాయకుడి విగ్రహం ఎదుట పీటపై కొంచెం బియ్యం పోసి దానిపై రాగి లేదా వెండి లేదా మట్టి పాత్రను వుంచాలి. దానికి పసుపు రాసి బొట్లు పెట్టాలి. దానిలో కొన్ని అక్షతలు, పూలు వేసి దానిపై మామిడి ఆకులు వుంచి ఆపై కొబ్బరికాయతో కలశం ఏర్పాటు చేసుకోవాలి. ఆ తరువాత పసుపు ముద్దతో చిట్టి పసుపు గణపతిని తయారు చేసుకోవాలి. పూజకు ముందు ఒక గ్లాసులో చెంచా లేదా ఉద్ధరిణి వుంచుకొని వక్కన మరో చిన్న ప్లేటు పెట్టుకోవాలి. పూజ చేస్తున్నప్పుడు చేతికి పసుపు, కుంకుమలు అవుతాయి కాబట్టి చేతికింద ఒక శుభ్రమైన గుడ్డను వుంచుకుంటే బాగుంటుంది. వినాయకుని పూజలో పత్రికి ఎంతో ప్రాధాన్యత వుంది. పూజలో ఉపయోగించే 21 రకాల ఆకులు (ఏక వింశతి పత్రాలు) ఔషధ గుణాలు కలిగినవి. ఈ ఆకులతో గణపతిని పూజించడంవల్ల వాటినుంచి వచ్చే ఔషధ యుక్తమైన వాసనలు అనారోగ్యాల బారిన పడకుండా నివారిస్తాయి. పూజ చేసిన రోజు నుండి నిమజ్జనం చేసేవరకూ తొమ్మిది రోజులు ఆ పత్రి మన పూజామంది రాల్లో వుంటుంది. కనుక అన్ని రోజులూ ఆరోగ్యకరమైన వాతావరణం నెలకొంటుంది. ఇక వినాయకుని విగ్రహంతోపాటు పూజించిన పత్రిని కూడా నీళ్ళలో వేసినందువల్ల నదులు, చెరువుల్లోని నీళు పరిశుభ్రపడుతుంది. కాలుష్యనివారణకు, ఆరోగ్య పరిరక్షణకు దోహదపడేందుగ్గానూ 21 ఔషధగుణాలున్న పత్రాలను వినాయక పూజలో ఉపయోగించటం, వాటిని నదుల్లో నిమజ్జనం చేయడం ఆచారంగా వస్తున్న సాంప్రదాయం.

## చిన్నారులకు ప్రత్యేక పండుగ:

వినాయకుని పూజా విధానం చిన్నారులను అమితంగా ఆకర్షిస్తుంది. వారికి పూజా విధానం, మన ఆచార సంప్రదాయాలు నేర్పేందుకు ఇది చక్కని అవకాశం. వివిధ రకాల ఆకులతో దేవుడ్ని పూజించడం ద్వారా వారికి ప్రకృతి ప్రాధాన్యతను వివరించే వీలుంది. చిన్నారులకు వీలుంటే రోజూ వేసుకునే దుస్తులకు భిన్నమైన బట్టలు వేస్తే వారికి వినాయకచవితి పట్ల మరింత ఆసక్తి పెరుగుతుంది. ఒకటి, మూడు ఐదు లేక తొమ్మిది ముడులతో తోరాన్ని తయారు చేసి, పూజలో వుంచి దానిని పిల్లలు, పెద్దలు అందరూ ధరించవచ్చు. విద్యార్థులు పూజకు ముందుగా చదువుతున్న క్లాసు పుస్తకాలను చదువుల దేముడు వినాయకుని ముందు ఉంచడం ఆనవాయితీ.

## విఘ్నేశ్వరుని ఆధిపత్యం:

వినాయక చవితి తిథినాడు భక్తి శ్రద్ధలతో గణనాధునిని కొలిస్తే వారి ఇంట ఈ ఏడాది అంతా శుభ యోగంగా ఉంటుందని పండితులు వక్కానించటం గమనార్హం. ఎందుకంటే విఘ్నేశ్వరుడికి ఆ సర్వేశ్వరుడు విఘ్నాధిపత్యం ఇచ్చారు. విఘ్నాధిపత్యం ఎవరికి ఇవ్వాలనే ఆలోచనలో ఉన్న శివపార్వతులు. తమ కుమారులిద్దరైన గణేశుడు, కార్తికేయులను పిలిచి ఓ పరీక్ష నిర్వహిస్తారు. ముల్లోకాల్లో ఉన్న పుణ్య నదుల్లో స్నానమాచరించి ఎవరైతే ముందు కైలాసానికి వస్తారో వారే విజేత అనేది పరీక్ష. ఈ విషయాన్ని కుమారస్వామి తన వాహనం నెమలిని ఎక్కి తన ప్రయాణాన్ని కొనసాగిస్తాడు. తన ఆకారాన్ని తలచుకుని బాధపడుతున్న గణేశుడు పరీక్షలోని అసలు సారాంశాన్ని పట్టి తల్లిదండ్రుల వద్దే ఉండి వారికి ముమ్మారు ప్రదక్షిణలు చేస్తాడు. కుమారస్వామి ఎక్కడికి వెళ్లినా అప్పటికే గణేశుడు చేరుకుని ఉండటాన్ని గమనిస్తాడు. ఆ విధంగా పరీక్షలో నెగ్గి విఘ్నాధిపత్యాన్ని పొందుతాడు గణేశుడు. ఈ విధంగా విఘ్నేశ్వరుని ఆధిపత్యం గురించి పురాణాల్లో అనేక కథలు ప్రాచుర్యంలో భాద్రపద శుద్ధ చవితి రోజున విఘ్నేశ్వరుడు పుట్టిన రోజని కొందరు, గణాధిపత్యం పొందిన రోజని ఇంకొందరు భావిస్తారు. మహేశ్వరాది దేవతా గణాలకు గణపతి ప్రభువు. అంటే సకలదేవతలకు ఆయనే ప్రభువన్న మాట. బ్రహ్మ తొలుత సృష్టి కార్యాన్ని ప్రారంభించే ముందు గణపతిని పూజించినట్టు రుగ్వేదం చెబుతోంది. బ్రహ్మవైవర్తన పురాణంలో ‘గణ’ శబ్దానికి విజ్ఞానమని, ‘ణ’ అంటే తేజస్సు అని పేర్కొన్నారు. ఇక పంచమ వేదంగా చెప్పుకునే మహాభారతాన్ని రచించిన వేదవ్యాసుడు తన లేఖకుడిగా గణపతిని నియమించాడు. గణనాథుడు జయకావ్యాన్ని అద్భుతంగా రాయడంతో దానిని తమ దగ్గరే ఉంచుకోవాలని దేవతలు తస్కరించారంటారు.

## విఘ్నేశ్వరునికి నైవేద్యం - తయారు చేసేవిధానం

బొజ్జగణపయ్యకు నైవేద్యంగా వారివారి సంప్రదాయాలను అనుసరించి నైవేద్యం సమర్పిస్తారు. అందులో ఉండ్రాళ్ళు నైవేద్యం తప్పనిసరిగా సమర్పించాలంటారు. ఉండ్రాళ్ళు బియ్యపు రవ్వతో తయారు చేస్తారు. ముందుగా శనగపప్పుని నాలుగు గంటల ముందు నానబెట్టుకోవాలి. తర్వాత ఒక దళసరి గిన్నె తీసుకుని అందులో ఒక కప్పు రవ్వకు రెండు కప్పుల నీరు పోసుకుని.. తగినంత ఉప్పు వేసుకుని నానబెట్టుకున్న శనగపప్పు వేసుకుని నీటిని మరగబెట్టుకోవాలి. తర్వాత బియ్యం రవ్వ వేసి కలపాలి. అనంతరం ఈ మిశ్రమాన్ని సన్నని మంటమీద ఉడికించి. దింపే ముందు కొంచెం నెయ్యి వేసుకోవాలి. తర్వాత మిశ్రమాన్ని గుండ్రంగా ఉండ్రాళ్ళుగా చుట్టుకోవాలి. వీటిని ఇడ్లి పాత్రలో పెట్టి ఒక 15 నిముషాలు ఆవిరిమీద ఉడికించాలి. అంతే ఉండ్రాళ్ళు రెడీ. కొన్ని ప్రాంతాల్లో ఉండ్రారాళ్ళను బియ్యం పిండితో కూడా చేస్తారు. ఇదేగాక చలిమిడి, వడపప్పు, పానకం, బెల్లంతో కుడుములు, పాలతాలికలు, జిల్లేడుకాయలు, అలాగే పులిహోర, గుగ్గిళ్లు, స్వీట్లు, రకరకాల పిండి వంటలు చేసి దేవుడికి నైవేద్యంగా పెడతారు. తెలంగాణలో ప్రత్యేకంగా ఆరోజు పెసరపప్పుతో తుమ్మికూర, చింతకాయ వేసి పప్పు చేస్తారు. తుమ్మికూరంటే వినాయకుడికి బాగా ఇష్టమని నమ్ముతారు. వీటితోపాటు వాళ్లవాళ్ల ఆచారాలను బట్టి బొజ్జగణపతికి సమర్పిస్తారు.

## విఘ్నేశ్వరుని నవరాత్రి ఉత్సవాలు -శోభాయాత్రలు

మట్టి వినాయకుడిన్ని పూజగదిలో ప్రతిష్ఠించిన తదుపరి ప్రత్యేక పూజలు చేయడంతో వినాయక చవితి రోజు నుంచి విఘ్నేశ్వరుడికి నవరాత్రి పూజలు మొదలవుతాయి. వీధివీధిలో ప్రతిష్ఠించిన మహాగణపతికి రోజుకొక్క తీరుగా భక్తిగీతాలు ఆలపిస్తూ, భజనలతో ఆ తొమ్మిది రోజులు భక్తిభావంతో మునిగితేలుతారు. ఈ పూజలు 3 రోజులు, 5 రోజులు, 9 రోజులు ఇలా ఎవరి తాహతు బట్టి వారు నిర్వహిస్తారు. అనంత చతుర్దశి నాడు గణేశుని సాగనంపుతూ ఉత్సవాన్ని జరుపుతారు. వచ్చే ఏడాది రావయ్య బొజ్జ గణపయ్య, గణపతి పప్పా మోరియా అంటూ భక్తులు నినదిస్తారు.

## విఘ్నేశ్వరుని ఉత్సవం - ఊరేగింపు

గతంలో హైదరాబాద్‌కే పరిమితమైన గణేశ ఉత్సవాలు ప్రస్తుతం రాష్ట్రమంతటా వ్యాపించాయి. యువత సంఘటితమై వీధివీధినా గణేశుని విగ్రహాలు ఏర్పాటు చేసి, నిత్యం పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలతో తొమ్మిది రోజుల పాటు రంగరంగ వైభవంగా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. నిలువెత్తు దేవుని విగ్రహం ఏర్పాటు చేసి సెభాష్ అనిపించుకుంటున్నారే కానీ, కొన్ని చోట్ల ఆ గణపతికి నిత్యపూజాదికాలు జరగటం లేదు. దేవుడి విగ్రహం అనేది ఏర్పాటు చేశాక నిత్యం విధిగా పూజ నిర్వహించాలి. కొండంత దేవుడికి కొండంత పత్రి సమర్పించలేకపోయినా ఫలమో, పత్రమో ఏదోఒకటి స్వామికి నివేదించాలి. గణేశుని ఉత్సవాలు, నిర్వహించే వారు ఈ కింది పద్ధతిని పాటిస్తే భక్తి, ముక్తి రెండూ లభిస్తాయి. జల, పర్యావరణ కాలుష్యాన్ని దృష్టిలో ఉంచుకొని సాధ్యమైనంత వరకు మట్టి వినాయకుని విగ్రహాలనే ప్రతిష్ఠించాలి. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేసిన బొమ్మలు, అతిగా రంగులు వాడిన బొమ్మలను వాడక పోవడం పర్యావరణ రీత్యా మంచిది. చవితి రోజు శాస్త్రోక్తంగా ప్రారంభించిన పూజను ఆరోజు నుంచి నిమజ్జనం జరిపే వరకు నిత్యం ఉదయం, సాయంత్రం యధాశక్తి పూజలు నిర్వహించాలి. రోజూ ఒక పూట అయినా ప్రసాదం తయారు చేసి దానిని అందరికీ పంచితే బాగుంటుంది. గణేశ ఉత్సవ స్థలాలు భక్తి కేంద్రాలుగా వుండాలి. రచ్చబండగా మారకుండా జాగ్రత్తలు తీసుకుంటూ, గణేష్ ఉత్సవాన్ని, నిమజ్జన ఊరేగింపును ఆహ్లాదకరంగా సంయమనంతో జరుపుకోవడం ద్వారా అది అందరికీ శ్రేయస్కరంగా భాసిల్లుతుంది.

అందరికి వినాయక చవితి శుభాకాంక్షలు
సర్వే జనాః సుఖినో భవంతు.

# బండారు సునీతను ఘనంగా సన్మానించిన మంత్రి జూపల్లి



వనపర్తి, సెప్టెంబర్ 6 :విద్యార్థులకు ఉజ్వలమైన భవిష్యత్తును అందజేస్తున్న గురువులు భావి భారత నిర్మాతలను తయారు చేయడంలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నారని ఎక్సైజ్, ప్రొహిబిషన్ ,సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. వనపర్తి జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు ప్రధానోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి జూపల్లి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులు చదువుతుంటారని వారిని ఉన్నతంగా తీర్చిదిద్ది దేశం గర్వించదగ్గ పౌరులుగా తయారు చేయాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయిని అవార్డుకు ఎంపికైన అమరచింత ఉన్నత పాఠశాల సహాయకులు హిందీ భాషోపాధ్యాయిని , ప్రముఖ కవయిత్రి బండారు సునీతను శాలువా, మెమొంటో, పూలదండ, ప్రశంసా పత్రంతో మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల్ల చిన్నారెడ్డి, కలెక్టర్ ఆదర్శ సురభి ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయ వృత్తిలో రాణిస్తూనే, సమాజంలో తన వంతు బాధ్యతగా రచనలు చేస్తూ ప్రముఖ కవయిత్రిగా, రచయిత్రిగా జాతీయ, అంతర్జాతీయ వేదికలపై అవార్డులు అందుకున్న బండారు సునీత, ఉన్నత విద్యావంతురాలిగాను పలువురికి ఆదర్శంగా నిలిచారని ప్రముఖులు అభినందించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ సంచిత్ గంగ్వార్, జిల్లా విద్యాధికారి గోవిందరాజులు, ఎంఈఓ లు, గజిటెడ్ ప్రధానోపాధ్యాయులు , జిల్లాలోని అన్ని పాఠశాలల నుంచి సుమారు రెండు వేలమంది ఉపాధ్యాయులు, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## టీడీపీ ఎమ్మెల్యే ఆదిమూలంపై బలాత్కారం, బెదిరింపు కేసు నమోదు

అమరావతి సెప్టెంబర్ 6 (ఎస్ ప్రెస్న్యూస్ ); : సత్యవేడు టీడీపీ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎమ్మెల్యే తిరుపతిలోని బీమాస్ హోటల్ లో తనపై లైంగిక దాడి చేశాడని ఆరోపించింది. తనపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని ఆరోపిస్తూ బాధితురాలు కొన్ని వీడియోలను విడుదల చేసింది. దీంతో స్పందించిన టీడీపీ అధిష్టానం వెంటనే అతన్ని పార్టీ నుంచి సస్పెన్షన్ చేసింది. కాగా ఘటనపై తిరుపతి పోలీసులు కేసు నమోదు చేశారు. భీమాస్ ప్యారడైజ్ హోటల్‌లో ఘటన జరిగిందని పోలీసులు వెల్లడించారు. ఎమ్మెల్యేపై బలాత్కారం, బెదిరించి అత్యాచారం చేశారని కేసు నమోదు చేశామన్నారు.

# మెడికల్ మాఫియాపై సీఎంకు బహిరంగ లేఖ..



-ఫార్మసి వ్యవస్థను నాశనం చేస్తున్న దళారి అసోసియేషన్
-బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బడా నేతలను అంటగాగిన కెమిస్ట్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ లు
-వంత పాడిన డ్రగ్స్ అధికారులు
-మందుల చాటున దోపిడీకి తెగబడిన వ్యాపారస్తులు
-ఆర్థిక నేరాలలో ఆరితేరిన దళారులు
-ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే ప్రజల ప్రాణాలు హరి
-తెలంగాణ ఫార్మసిస్టు అనుబంధ సంఘాల జేఏసీ

హైదరాబాద్, సెప్టెంబర్ 6 : ప్రజల ఆరోగ్యంతో చెలగాట మాడుతున్న మెడికల్ మాఫియా ఆగడాలను అరికట్టకపోతే అమాయకుల ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని తెలంగాణ ఫార్మసిస్ట్ అనుబంధ సంఘాల జేఏసీ నాయకులు వాకిట అశోక్ కుమార్, కన్నెబోయిన శ్రీనివాస్, బాలరాజ్, సత్యనారాయణ గౌడ్, డాక్టర్ శివకుమార్ తేజావత్ సీతారాంబాబు, కురుమ శంకర్, ప్రొఫెసర్ గంప విజయకుమార్, అలీమ్ ఆదర్శ్, లక్ష్మీనారాయణలు ఆవేదన వ్యక్తం చేశారు.

దశాబ్దాలుగా మెడికల్ షాపుల వ్యాపారాన్ని కొనసాగిస్తున్న వారు బహిరంగ ఆర్థిక నేరాలకు పాల్పడుతూ.. ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నప్పటికీ ప్రభుత్వం కానీ, సంబంధిత అధికారులు కానీ పట్టించుకోకపోవడంతో పరిస్థితి చేజారిపోయిందన్నారు. ఫలితంగా మొత్తం ఫార్మాసి వ్యవస్థ భ్రష్టు పట్టిందన్నారు.. తెలంగాణ రాష్ట్రంలో గత పది సంవత్సరాలు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ హయాంలో ఆ ప్రభుత్వంలో బడా బాబులను అంటగాగిన కెమిస్ట్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అండ్ దళారులు అంటకాగి దోపిడీకి తెగబడడంతో ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఏర్పడిందన్నారు. డ్రగ్స్ అండ్ కాస్మోటిక్స్ యాక్ట్ , ఫార్మసీ యాక్ట్ అమలు అమలు చేసే బాధ్యతను ప్రభుత్వము డ్రగ్స్ అధికారులు పూర్తిగా విస్మరించడంతో ఎక్కడ చూసినా మెడికల్ షాపులలో డాక్టర్ల ప్రిస్క్రిప్షన్ లేకుండానే విచ్చలవిడిగా స్టిరాయిడ్స్ మత్తు మందులు యాంటీబయాటిక్స్ విక్రయిస్తున్నారన్నారు.

వాస్తవానికి ఫార్మసిస్ట్ అందుబాటులో ఉండి మందులు డిస్పెన్స్ చేయాలి, కానీ ఇక్కడ 90శాతం మెడికల్ షాపుల్లో ఎందుకు విరుద్ధంగా కొంతమంది ఫార్మసిస్టుల సర్టిఫికెట్లు ఆద్దెలకు తీసుకొని వ్యాపారస్తులే దుకాణాలు నడిపిస్తున్నారు. ఈ వ్యవహారంపై గతంలో ఫార్మసి కౌన్సిల్ కు, డ్రగ్స్ అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు లేకపోవడంతో మెడికల్ మాఫియా మరింత రెచ్చిపోతుందన్నారు. ఒక ప్రక్క ఫార్మసిస్ట్ పోస్టులు ఖాళీగా ఉండడం మరో పక్క మందుల షాపులలో ఫార్మసిస్టులు లేకుండానే మందులు షాపుల నిర్వహణ కోసం అధికారులు లైసెన్సులు జారీ చేయడం తనిఖీ లు అసలు చేపట్టకపోవడం కేసులు కూడా నమోదు చేయకపోవడం పలు కారణాలను చూస్తే డ్రగ్స్ అధికారులే మెడికల్ మాఫియాని పెంచి పోషిస్తూ పెద్ద ఎత్తున ఆర్థిక నేరాలరు తెరలేపారని తెలుస్తోందన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన హైడ్రా ప్రాజెక్ట్ ప్రజల్లో మంచిపేరు తీసుకొచ్చిందన్నారు. కబ్జాదారుల నుండి ప్రభుత్వ భూములను రక్షించడంతో పాటు చెరువులు, కుంటలు, కాలువలు, నాళాలు అన్నీ అన్యాక్రాంతం కాకుండా కాపాడే ప్రయత్నం జరుగుతుందన్నారు.


Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.
'Editor: B. Devadas.
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.